# పంజాగుట్ట నిమ్స్‌లో లైంగిక దాడి కలకలం.. పోక్సో కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నట్ట నడిబొడ్డున.. ఎప్పుడూ రోదులూ, వైద్యులు, సిబ్బందితో కిటకిటలాడే పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో లైంగిక దాడి ఘటన కలకలం రేపింది. ఒంటరిగా ఉన్న బాలికపై దాడికి ప్రయత్నించాడు ఓ దుర్మార్గుడు. శనివారం (జూన్ 13) జరిగిన ఈ ఘటనతో ఆసుపత్రి వాతావరణం అంతా షాకింగ్ లో మునిగిపోయింది. ఆస్పత్రి ఆవరణలో ఒంటరిగా ఉన్న బాలికపై లైంగిక దాడికి యత్నించాడు ఓ వ్యక్తి. బాలిక కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్పత్రి ఆవరణలో భవన నిర్మాణ పనులు చేసేందుకు వచ్చిన కూలీ కుటుంబం.. నిమ్స్ లోనే నివాసం ఉంటోంది. బాలిక తల్లిదండ్రులు పనులకు వెళ్లగా.. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి వచ్చి బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో




భయాందోళనకు గురైన బాలిక ఒక్కసారిగా కేకలు వేసింది. బాలిక అరవడంతో నిందితుడు పారిపోయాడు. బాధిత బాలిక కుటుంబం పంజాగుట్ట పోలీసులకు పిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# విద్య హక్కు కావాలి..! వ్యాపారం కాదు..!


- విద్యార్థుల భవిష్యత్తు కోసం ఫీజుల దోపిడికి అడ్డుకట్ట వేయాలి..!
- కార్పోరేట్ విద్యాసంస్థలకు భిక్షపతి యాదవ్ హితవు..

భిక్షపతి యాదవ్.. లుక్స్ గ్లోబల్ పాండేషన్ చైర్మన్..

- కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల ఫీజుల దోపిడీపై ఆగ్రహం వ్యక్తం..
- విద్యను వ్యాపారంగా మార్చారని విమర్శ..
- అధిక ఫీజులు వసూలు చేసే సంస్థలపై తక్షణమే చర్యలకు విజ్ఞప్తి..
- డీఈవో, ఎంఈవోలు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని డిమాండ్..
- బాధిత తల్లిదండ్రులకు అండగా ఉంటామని భిక్షపతి హామీ..

**దుండిగల్, పెన్ పవర్, జూన్ 13:** కార్పొరేట్ విద్యాసంస్థలు, విద్యను వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నాయని "లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్" ఫౌండర్ చైర్మన్, బిక్షపతి యాదవ్ తీవ్రంగా విమర్శించారు. పెరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా కార్పోరేట్ విద్యాసంస్థలపై శనివారం ఓ ప్రకటనలో ఆయన తీవ్రంగా విమర్శించారు.. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు కావాలని, వ్యాపారం కాకూడదని విజ్ఞప్తి చేశారు.. అయినప్పటికీ ప్రస్తుతం ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందన్నారు.. ప్రాథమిక విద్య నుంచి ఇంజనీరింగ్ వరకు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడంతో పాటు వివిధ పేర్లతో అదనపు ఛార్జీలు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి, సామాన్య కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.. విద్యాసంస్థలు సేవా దృక్పథంతో పనిచేయాల్సి ఉండగా.! కేవలం లాభాల కోసం, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం సమగ్ర విధానం తీసుకురావాలని, ప్రతి విద్యాసంస్థ తమ ఫీజుల వివరాలను పారదర్శకంగా ప్రకటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు..




## విద్యాశాఖ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి..

విద్యాశాఖ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉన్నందున అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో డీఈవోలు, ఎంఈవోలు విద్యాసంస్థల మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు.. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఫీజుల నియంత్రణ కమిటీలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు.. విద్యా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక భద్రతను కాపాడగలమని పేర్కొన్నారు.. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తే సహించేది లేదని హెచ్చరించిన బిక్షపతి యాదవ్, అలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే తగిన పరిష్కార మార్గం చూపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు..



# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!

- వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోతే తిరిగి విధుల్లోకి అవకాశం
- అంగన్వాడీల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క వెల్లడి
- వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని,

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు

## నేడు, రేపు వర్షాలు

### పలు జిల్లాలకు 'పసుపు రంగు' హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్::** పలు జిల్లాలకు వాతావరణ శాఖ వర్ష సూచన జారీ చేసింది. ఆది, సోమ వారాల్లో పలు జిల్లాల్లో గంటకు 40-50 కి.మీ. వేగంతో కూడిన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని సూచించింది. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. మంగళ, బుధవారాల్లోనూ పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. నైరుతి రుతుపవనాలు శనివారం భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాల మీదుగా సోలాపుర్, కళింగపట్నం, పారాదీప్, ముజఫర్‌పూర్‌ల మీదుగా విస్తరించాయి. రెండు రోజుల్లో తెలంగాణ, ఏపీ, కర్ణాటకలతోపాటు పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. రాష్ట్రంలో శనివారం 30 ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సంగారెడ్డి

-4 లో



# ఆదివాసీ సంప్రదాయాలు నేటి తరానికి ఆదర్శం

## 'ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం'లో మంత్రి జూపల్లి

**హైదరాబాద్ పెన్ పవర్::** ఆదివాసీ సంప్రదాయాలు చాలా గొప్పవని..నేటి తరానికి ఆదర్శమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచి జంగుబాయి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి..లబ్ధిదారులకు చీర-సారె అందజేశారు. ఆదివాసీలు వారి ఆచారం ప్రకారం మంత్రి కాళ్లు కడిగి గ్రామంలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మరోసారి ఈ గ్రామానికి వచ్చి ఆదివాసీ సంప్రదాయాలను నేర్చుకుంటానని వ్యాఖ్యానించారు.

# చిరుధాన్యాలకు కొత్త విధానం

## ఐదేళ్లలో రెట్టింపు సాగే లక్ష్యం
## పంటల మార్పిడికి ప్రోత్సాహం
## రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు



ఈనాడు,హైదరాబాద్: తెలంగాణలో చిరుధాన్యాల సాగును ఐదేళ్లలో రెట్టింపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటల మార్పిడితో ఆ రకాల సాగుకు పెద్దపీట వేయనుంది. రాష్ట్ర వ్యవసాయ రంగంలో చిరు ధాన్యాల సాగును ప్రాధాన్య భాగంగా మార్చడంతో పాటు ప్రకృతి వ్యవసాయం, జీరో బడ్జెట్ సాగు, పోషకాహార భద్రత తదితర అంశాలతో కొత్త విధానం (మిల్లెట్ విజన్) రూపొందించి, విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

గత ఆర్థిక సంవత్సరం(2025-26)లో రాష్ట్రంలో 8,84,528 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగయ్యాయి. ఇందులో జొన్నలు ఆరు లక్షల ఎకరాల్లో రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు రెండు లక్షలకుపైగా ఎకరాల్లో సాగయ్యాయి. ఎల్‌నినో పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తక్కువ నీటితో పండే రకాల సాగును ప్రోత్సహించాలని, అందులో భాగంగా పప్పులు, నూనెగింజలు, ఉద్యాన పంటలతో పాటు చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల సాగు సరళిని పరిశీలించి..అందుకోసం ప్రత్యేక విధానం రూపకల్పనకు ఆదేశించింది. దీనికి అనుగుణంగా వ్యవసాయశాఖ కసరత్తు చేపట్టింది.

**16 లక్షల ఎకరాలకు పెంచేలా..**

చిరుధాన్యాల సాగును 2030 నాటికి 16 లక్షల ఎకరాలకు విస్తరించాలనేది మిల్లెట్ విజన్ ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుచేస్తారు. రైతులకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. జిల్లాల వారీగా పంటల ప్రణాళికను రూపొందిస్తారు. అధిక దిగుబడులు వచ్చే విత్తనాల పంపిణీతోపాటు సాగుకు అవసరమైన సాంకేతిక సాయం, యంత్ర పరికరాలను అందజేస్తారు. భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్), అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) సాయం తీసుకుంటారు.

వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాల ఉత్పత్తికి ప్రోత్సాహం అందిస్తారు.

ఉత్పత్తుల నిల్వ, శుద్ధి, ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు. ఇందులో మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలకు భాగస్వామ్యం కల్పిస్తారు.

చిరుధాన్యాల వినియోగం పెంపుదల, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించే లక్ష్యంతో రేషన్‌షాపుల ద్వారా జొన్నలు సరఫరా చేస్తారు.

సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ సంస్థలలోనూ జొన్నలతో కూడిన ఆహారాన్ని చేరుస్తారు.

# 40-50 కి.మీ. వేగంతో
# ఈదురుగాలులు

-3 పేజీ తరువాయి

జిల్లా కొండాపూర్ మండలం కేంద్రంలో 11.5 సెం.మీ. కురిసింది. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో 7.3, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లిలో 6.7 సెం.మీ. నమోదయ్యాయి. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో విస్తృతంగా, మెదక్, వికారాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, సూర్యాపేట జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 3.1 సెం.మీ. నుంచి 5.4 సెం.మీ. మధ్య వర్షాలు కురిశాయి.


**సీఎం ఆదేశాలు.. యంత్రాంగం అప్రమత్తం**

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అప్రమత్తం చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అన్నివిధాలుగా సన్నద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. సీఎస్, డీజీపీలతోపాటు సీనియర్ అధికారులంతా పరిస్థితులపై సమీక్షించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎం ఆదేశాలతో అప్రమత్తమైన పోలీసు, హైడ్రా, రెవెన్యూ, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు శనివారం చెరువులు, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

**విమాన సర్వీసుల దారి మళ్లింపు**

శంషాబాద్‌లో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవడంతో డ్టటహ్రాదూన్, దిల్లీ నుంచి వచ్చిన ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలను బెంగళూరుకు, బెంగళూరు నుంచి వచ్చిన ఇండిగో విమానాన్ని విజయవాడకు దారి మళ్లించారు. పలు విమానాలు ఆలస్యంగా బయలుదేరాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

# వాటర్ సంప్ ఎక్కడ ఉండాలి.. ప్రహారీ నిర్మాణంలో వాస్తు పాటించాలా..!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంట్లో ప్రతిది వాస్తు ప్రకారమే ఉండాలి.. అంతేకాదు ఇంటి సంపు నిర్మాణం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇంటికి ప్రహరీగోడ నిర్మించుకొనే విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి..మొదలగు విషయాల గురించి వాస్తు కన్సల్టెంట్? కాశీనాథుని శ్రీనివాస్ గారు ఏమంటున్నారో చూద్దాం...

ప్రశ్న: కొత్తగా కట్టుకున్న ఇంటికి సంపు నిర్మించుకోవాలనుకుం టున్నాం. దీనికి కూడా వాస్తు పాటించాలా? ఒకవేళ సంపు కట్టుకుంటే ఏవైపు ఉంటే మంచిది?

**జవాబు:** సంపు నిర్మాణానికి కూడా వాస్తు పాటించాల్సిందే. ఇంటికి తూర్పు ఈశాన్యంలో సంపు కట్టుకుంటే మంచిది.

**ప్రశ్న:** మా ఇంటికి తూర్పు, ఉత్తరం వైపు రోడ్స్ ఉన్నాయి. మిగతా రెండువైపులా కాంపౌండ్ వాల్. కట్టుకోవాలనుకుంటున్నాం. రెండువైపులా వదిలేసి, మిగతా రెండువైపుల మాత్రమే కాంపౌండ్ వాల్ కట్టుకోవచ్చా?

**జవాబు:** కుదిరితే నాలుగు వైపులా ప్రహరీ కట్టుకోవాలి. అదే మంచిది. ఒకవేళ వీలు కాకుంటే దక్షిణ, పడమర వైపులా ప్రహరీ కట్టుకోవచ్చు.

# భవిష్యత్తు యుద్ధ వ్యూహాలకు సిద్ధమవ్వాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** కాలంతోపాటు యుద్ధరంగ స్వరూపం పూర్తిగా మారిపోతోందని, ఆధునిక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సైనికులు క్షణాల్లోనే నిర్ణయాలు తీసుకోగలగాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన 217వ బ్యాచ్ ఉమ్మడి గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 231 మంది ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ అధికారులకు 'వింగ్స్' పతకాలు బహూకరించి, గౌరవ వందనం స్వీకరించారు. వీరిలో వియత్నాంకు చెందిన ట్రైనీలు కూడా ఉన్నారు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. "కొత్త తరం సైనికులైన మీరందరూ భవిష్యత్ యుద్ధ వ్యవస్థలను అర్థం చేసుకుని మెరుగైన వ్యూహాలకు సన్నద్ధం కావాలి. ఈ డిజిటల్ యుగంలో రాడార్లు, శాటిలైట్లు, డ్రోన్లు, రోబోటిక్స్, సెన్సర్ల వంటి కంటికి కనిపించని శత్రువులతో కూడా పోరాడాల్సి వస్తుంది. అందుకే శారీరక దృఢత్వంతోపాటు సాంకేతిక విషయాల్లోనూ పట్టు సాధించాలి. వాయుసేనలో మహిళా పైలట్ల సంఖ్య పెరుగుతుండటం హర్షణీయం" అని అన్నారు. వియత్నాం ట్రైనీలను ఉద్దేశించి.. 'మీరు సాధించిన ఈ విజయానికి భారతదేశంతోపాటు మీ మాతృదేశం కూడా గర్విస్తోంది. ఈ శిక్షణ ద్వారా భారత్-వియత్నాంల మైత్రి మరింత బలోపేతమవుతుంది' అని అన్నారు.

**ప్రధాన ఆకర్షణగా నిలిచిన వైమానిక ప్రదర్శనలు**

పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉత్తీర్ణులై.. ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణకు చేరిన మొదటి బ్యాచ్ మహిళా క్యాడెట్లు ఈ పరేడ్‌లో ప్రత్యేకంగా నిలిచారు. అంతకుముందు ఆకాశ్ గంగా, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ (ఏడబ్ల్యూడీటీ) వారి వైమానిక ప్రదర్శన అందరినీ ఆకర్షించింది. ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ నేతృత్వంలో జరిగిన ఫ్లై-ఫాస్ట్ ఫార్మేషన్‌లో పిలాటస్ పీసీ-7 ఎంకేఐ, హాక్, కిరణ్, చేతక్ వంటి నాలుగు రకాల శిక్షణ విమానాలను ప్రదర్శించారు. ఎస్‌యూ-30 ఎంకేఐ, సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్, సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ (ఎస్‌కేఏటీ)ల వైమానిక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!

-3 పేజీ తరువాయి

వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.

# ఫోర్బ్స్ '30 ఆసియా అండర్ 30'లో హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ విద్యార్థి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోర్బ్స్ '30 ఆసియా అండర్ 30' జాబితాలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ విద్యార్థి సౌవిక్ ఘోష్ ప్రారంభించిన అంకుర సంస్థ 'కాగ్నిటీ' చోటు దక్కించుకుంది. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఏఐ సహకారంతో ఈ సంస్థ పాఠాలు చెబుతోంది. కోల్‌కతాకు చెందిన సౌవిక్ ఘోష్, జె.త్రిశాల్, ఫల్గుణి శ్రీవాత్సవలు మూడేళ్ల క్రితం ఈ సంస్థను ఆరంభించారు. బుద్ధిమాంద్యం, మానసిక వైకల్యం, ఆటిజంతో బాధ పడుతున్న చిన్నారుల కోసం ఈ అంకుర సంస్థ ప్రారంభించిన ఏడాది లోపే... ఐరోపాకు చెందిన బైసిస్టర్ కలెక్షన్ అనే దాతృత్వ సంస్థ నుంచి లక్ష డాలర్ల బహుమతి గెలుచుకుంది. తాజాగా ఫోర్బ్స్ '30 ఆసియా అండర్ 30'లో స్థానం పొందడం గర్వకారణమని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**తనలా ఎవరూ బాధ పడొద్దని**

కోల్‌కతాలో బీటెక్ పూర్తి చేసిన సౌవిక్ ఎం.ఎస్. చేసేందుకు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌కు వచ్చారు. తన ప్రాజెక్ట్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాలు, ఒడిశాలోని ప్రత్యేక అవసరాల విద్యార్థుల పాఠశాలలకు వెళ్లారు. వారికి అర్థమయ్యేలా ఏఐతో పాఠాలు ఎలా చెప్పాలో తెలుసుకున్నారు. ప్రయోగాత్మకంగా కొందరికి పాఠాలు చెప్పారు. ప్రయోగాలు విజయవంతం కావడంతో మరిన్ని పరిశోధనలు చేశారు. సౌవిక్ చిన్నతనంలో సరిగా మాట్లాడలేకపోవడంతో తోటి విద్యార్థులు 'మూగ వాడు' అంటూ హేళన చేసేవారు. ఆ బాధను అధిగమించి.. తనలా ఎవరూ వేళాకోళానికి గురి కావొద్దంటూ ఏఐ ద్వారా పాఠాలు చెప్పాలనే ఆలోచన చేశాడని ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.

# తాత్కాలిక సర్దుబాట్లు కాదు.. పెద్ద పరిష్కారాలు కావాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** 'రైతులకు పెట్టుబడి వ్యయం పెరుగుతోంది.. ఆదాయం తగ్గుతోంది. సుమారు యాభై శాతం మంది రైతులకు పెట్టుబడి వ్యయం కంటే తక్కువ ఆదాయం వస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్‌లు.. ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధంతో సాగు వ్యయం అంతకంతకీ పెరిగిపోతోంది. వ్యవసాయ సంక్షోభం మరింత ముదిరి సన్న, చిన్నకారు, కౌలు రైతులను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తోంది' అని వ్యవసాయ, ఆర్థిక శాస్త్రవేత్త.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ అన్నారు. రైతుకు సాగు వ్యయం తగ్గి ఆదాయం పెరగడానికి తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, పెద్ద పరిష్కారాలు కావాలని, లేదంటే వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి గట్టెక్కదని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఫర్ ఎగ్రేరియన్ స్టడీస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆమె 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యవసాయ రంగంపై ఇరాన్ యుద్ధ ప్రభావం తదితర అంశాల గురించి వివరించారు. ముఖ్యాంశాలివీ..

**భారతదేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లేంటి ?**

ఉత్పాదకతను పరిగణనలోకి తీసుకొంటే చాలా అసమానతలు ఉన్నాయి. అయితే దేశవ్యాప్తంగా ఇందుకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక.. ఇలా పలు రాష్ట్రాల్లోని 27 గ్రామాలను ఎంపిక చేసుకొని మేము అధ్యయనం చేశాం. ప్రతి గ్రామంలో కూడా 2 - 5 శాతం కుటుంబాలు వ్యవసాయంలో బాగా రాణిస్తున్నాయి. మిగిలిన రైతుల పరిస్థితి సరిగా లేదు. ఇందులో సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాలు సహా అన్ని రాష్ట్రాల్లోనూ కౌలు రైతులు గణనీయంగా పెరిగారు. ఎరువులు, విత్తనాలు, యంత్రాలు.. ఇలా అన్ని ఖర్చులూ పెరిగాయి. అధ్యయనం చేసిన గ్రామాల్లో ఒకచోట కరవు.. ఇంకో చోట వరదలు.. కొన్ని చోట్ల సాధారణ వ్యవసాయం.. ఇలా భిన్న పరిస్థితులు దర్శనమిచ్చాయి. గ్రామాల వారీగా చూసినపుడు 50 శాతం మందికి పైగా రైతులకు పెట్టుబడి వ్యయం కంటే తక్కువ ఆదాయం వస్తోంది. ఉత్పాదకత రెండింతలైతేనే ఆదాయం పెరుగుతుంది. కానీ తుపాన్లు, వరదలు ఇలా పలు ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడి తగ్గడం తప్ప పెరగడం లేదు.

**అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధ ప్రభావం మన రైతాంగంపై ఎలా ఉంటోంది ?**

ఎరువులకు ఎక్కువగా భారత్ దిగుమతులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులున్నాయి. 35 శాతం హర్మూజ్ ద్వారా రావాలి. యుద్ధ ప్రభావంతో సరఫరా చేసే దేశాల్లో ఉత్పత్తి తగ్గిపోయింది. రష్యా, చైనాల్లో ఎరువులు ఉన్నా ఎగుమతిని ఆపేశాయి. ఎరువుల లభ్యత, ధరలు రెండూ.. ప్రస్తుతం ప్రధానాంశాలు. ఖరీఫ్ సీజన్‌లో ఉన్నవాటితో సర్దుకున్నా, కొంత ఇబ్బంది పడినా, రబీలో సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది. యుద్ధం ఆగిపోయినా గల్ఫ్ దేశాల్లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి సమయం పడుతుంది. ఎరువుల ఉత్పత్తిలో కీలకమైన నేచురల్ గ్యాస్‌కు కూడా ఇబ్బందే. మన సొంత ఉత్పత్తి తగినంతగా పెరగలేదు. సంక్షోభం వచ్చినపుడు మాట్లాడటం తప్ప తర్వాత తగిన ప్రయత్నం జరగడం లేదు. ఎరువులు కూడా ఎంత అవసరమో అంతే వాడాలి. యూరియా వినియోగాన్ని తగ్గించాలి. ప్రస్తుత సంక్షోభాన్ని పరిగణనలోకి తీసుకొని ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన పెంచాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు గట్టి కృషి చేయాలి.

**స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పరిణామాలను ఎలా చూడాలి ?**


పది సంవత్సరాలుగా అమెరికా సహా కొన్ని దేశాలు ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)ను పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. భారత్ డబ్ల్యూటీవోలో ఆహారభద్రత కోసం పోరాటం చేస్తున్నా పలు దేశాలకు ఆసక్తిలేదు. ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాలతో ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. అమెరికాతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఆ దేశాల్లోని ఉత్పత్తులను భారత్‌లోకి దిగుమతి చేయడమే వాటి ప్రధాన ఉద్దేశం. డెయిరీతో పాటు మొక్కజొన్న, సోయాబీన్ ఇలా పలు ఉత్పత్తులపైన ప్రభావం ఉంటుంది. సన్న, చిన్నకారు రైతులు నలిగిపోతారు. సహకార సొసైటీలు దెబ్బతింటాయి. ఐదు శాతం మంది రైతులు పోటీపడొచ్చు... లాభాలు గడించవచ్చు. 50-60 శాతం మంది రైతులు మాత్రం ఇబ్బందులకు గురవుతారు. ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలి.


**వ్యవసాయ కార్పొరేటీకరణ పరిస్థితులపై మీ అంచనాలేమిటి ?**

జ: కార్పొరేట్ వ్యవసాయం పరోక్షంగా ఉంది తప్ప ప్రత్యక్షంగా లేదు. కాంట్రాక్టు ఫార్మింగ్ ఉంది. అయితే విత్తనాలు, ఎరువులు, ఆయిల్, ట్రాక్టర్లు ఇలా రైతుకు అవసరమైన ప్రధానమైనవన్నీ కార్పొరేట్ కంపెనీల నియంత్రణలో ఉన్నాయి. మన దేశంలో ఏడాదికి రూ.60 వేల కోట్ల విత్తన వ్యాపారం జరుగుతోంది. ఇందులో 70 శాతం విత్తనంపై ప్రైవేటు మార్కెట్‌దే గుత్తాధిపత్యం. వరి, గోధుమ విత్తనాల్లో ప్రైవేటు కంపెనీల ప్రాబల్యం తక్కువగా ఉన్నా, మిగిలినవాటిపై ఆధిపత్యం ప్రైవేటుదే. విత్తన ఉత్పత్తిలో ప్రైవేటు రంగం ఉండకూడదని కాదు.. విత్తన ధరలు, నాణ్యతను ప్రభుత్వం ఎలా రెగ్యులేట్ చేయగలుగుతుందన్నది ముఖ్యం. నాణ్యత గల విత్తనాల సరఫరా, ధరలు అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత.

# భక్తులకు శుభవార్త.. ప్రారంభోత్సవానికి సిద్ధంగా కొమురవెల్లి రైల్వే స్టేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** కొమురవెల్లి మల్లన్న భక్తులకు శుభవార్త.. కొమురవెల్లి మల్లన్న పుణ్య క్షేత్రానికి ఇకపై రైళ్లలో వెళ్లవచ్చు. కొత్త నిర్మిస్తున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. రేపేమాపో ప్రారంభించనున్నారు. ఈ రైల్వే స్టేషన్ ప్రారంభమైతే హైదరాబాద్ నుంచి, ఇతర ప్రాంతాలనుంచి భక్తుల ప్రయాణానికి మరింత సౌకర్యంగా ఉంటుంది. దీంతోపాటు కొమురవెల్లి పుణ్యక్షేత్రాన్ని ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ మెరుగుపడనుంది. సిద్దిపేట జిల్లాలో కొత్తగా నిర్మించిన కొమరవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం (జూన్ 13) ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రసిద్ధ కొమరవెల్లి మల్లన్న స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు కనెక్టివిటీని పెంచేందుకు ఈ రైల్వే స్టేషన్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.5.63 కోట్లు కాగా, ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. త్వరలోనే స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించనున్నట్లు
మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవెల్లి మల్లన్న ఆలయం తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. కొత్త రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే భక్తుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.




# దంచి కొడుతున్న వాన.. అవసరమైతే తప్ప బయటకు రావద్దండీ




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. ఈదురుగాలులతో కూడిన వర్షం ఒక్కసారిగా పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, బంజారాహిల్స్, మొహిదీపట్నం, నాంపల్లి, లక్డీకాపూల్ అమీర్ పేట్, కూకట్ పల్లి, మియాపూర్ లలో వర్షం దంచికొడుతుంది. గచ్చిబౌలిలోనూ భారీవర్షం పడుతుంది. చందానగర్, శేరిలింగంపల్లిలో వానలు పడుతున్నాయి. చెట్ల కింద, హోర్డింగ్ ల కింద నిల్చోవద్దని, ప్రమాదాలు జరిగే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

**మధ్యాహ్నం నుంచి...**

ఉదయం నుంచి హైదరాబాద్ నగరం మేఘావృతమై ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం పడటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. అలాగే ఉప్పల్, మలక్ పేట్, దిల్ సుఖ్ నగర్, సరూర్ నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోనూ వాన పడుతుంది. వర్షం ధాటికి శంషాబాద్ - బెంగళూరు హైవేపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దాదాపు గంటన్నర సేపు కురిసిన వర్షానికి కొండాపూర్ లో 8.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. భారీ ఈదురుగాలులకు చెట్లు పడే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది.

**విద్యుత్తు శాఖ హెచ్చరికలు...**

వర్షాల నేపథ్యంలో ప్రజలకు తెలంగాణ విద్యుత్ శాఖ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలు, గాలివానల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. తెగిపోయిన విద్యుత్ వైర్లు, కూలిన విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దని చెప్పింది. విద్యుత్ వైర్లు, పరికరాలను స్వయంగా ముట్టవద్దని కోరింది. మరమ్మత్తులు చేసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరిక జారీ చేసింది. ప్రమాదకర విద్యుత్ పరిస్థితులు కనిపిస్తే వెంటనే 1912కు సమాచారం ఇవ్వాలని కోరింది. మీ ప్రాంతానికిక దగ్గరగా ఉన్న టీజీ ఎస్.సి.పి,డి.సీ.ఎల్ అధికారులకు వెంటనే తెలియజేయాలని కోరారు.

# వాతావరణం చల్లబడేది ఎప్పుడంటే.. కీలక అప్ డేట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొనసాగుతుంది. వానలు కూడా పడుతున్నాయి. అయితే వాతావరణం మాత్రం చల్లబడలేదు. నైరుతి రుతుపవనాలు ఇంకా పూర్తి స్థాయిలో విస్తరించలేదు. దీంతో జూన్ రెండో వారం పూర్తవుతున్నప్పటికీ ఎండల తీవ్రత తగ్గడం లేదు. మరికొన్ని రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే గతంలో కంటే ఎండల తీవ్రత తక్కువగా ఉంటుందని, అదే సమయంలో ఉక్కపోత వాతావరణం మాత్రం కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల చివరి వారంలో కొంత కూల్ వాతావరణం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు.

**భిన్న వాతావరణం...**

ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. మరొకవైపు వానలు కూడా కురుస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో పడటం లేదు. ఎలినినో ప్రభావంతో ఈసారి తక్కువ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ ముందు నుంచి చెబుతున్నట్లుగానే ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుంది. తేలికపాటి వానలు పడుతున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని చెబుతుంది. ఈదురుగాలులు కూడా వీస్తాయని పేర్కొంది. గంటకు నలభై నుంచియాభై కిలోమీటర్ల మేరకు ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. దక్షిణ కోస్తా, రాయలసీమలో వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉక్కపోత, సెగ మాత్రం కంటిన్యూ అవుతుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

**తెలంగాణలో ఎండల తీవ్రత...**

తెలంగాణలో ఎండల తీవ్రత చాలా వరకూ తగ్గింది. నలభై డిగ్రీలు లోపే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని జిల్లాల్లో వానలు పడుతున్నాయి. హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారుల అంచనా. మరికొన్ని జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ జిల్లాల్లో వానలు పడుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ వంటి జిల్లాల్లో వరుణుదేవుడు ముఖం చాటేశాడు. నైరుతిరుతు పవనాలు మహబూబ్ నగర్ జిల్లాలోకి ప్రవేశించడంతో కొంత వానలు పడుతున్నాయి. ఉక్కపోత ఇంకా కొనసాగుతూనే ఉంది. విద్యుత్తు వినియోగం కూడా తగ్గలేదు. ఈ నెల చివరి నాటికి కాని సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# జగన్ సభలకు అనుమతి ఎందుకు ఇవ్వడం లేదు : రేవంత్ రెడ్డి లాజిక్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలిసారిగా స్పందించారు. ఈ విషయం ముగిసిన అధ్యాయంగా చెబుతూనే ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి పేరు ప్రస్తావిస్తూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తెలంగాణలో పవన్ సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదన్న విషయం తన పరిధి కాదని చెబుతూనే ఏపీలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సభలకు అనుమతి ఇవ్వకపోవడంపై పవన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో జగన్ రెడ్డిని వెనకేసుకువచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటంపై ఆసక్తికర చర్చ జరుగుతోందని చెబుతున్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరిగేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన తెలంగాణలో పోటీ చేయడానికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ఆ హక్కు ప్రజాస్వామ్యం కల్పించింది. ఇందులో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సీఎం వివరించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడతామంటే ఇక్కడి వారు అదేవిధంగా స్పందిస్తారని సీఎం వ్యాఖ్యానించారు. పవన్ అన్నారు, పొన్నం కౌంటర్ ఇచ్చారు అంతటితో ఆ కథ ముగిసిపోయిందని సీఎం తేల్చిచెప్పారు. హైదరాబాద్ లో పవన్ సభకు అనుమతి ఇవ్వాలా? వద్దా? అన్నది పోలీసుల ఇష్టం. నా ప్రమేయం ఏముంటుంది? తెలంగాణలో అనేక మంది స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు, ధర్నాలు చేస్తున్నారు. వారందికీ లభించిన అనుమతులు పవన్ కల్యాణ్ కు లభించలేదంటే, అది పోలీసుల నిర్ణయం. ఏపీలో జగన్ కు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదన్నది పవన్ ముందుగా చెప్పాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత విధానాలను ఎప్పుడూ సమర్థించదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే పవన్, టి.కాంగ్రెస్ వివాదంలో ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి పేరు ప్రస్తావించడమే హాట్ టాపిక్ అవుతోంది.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తన పర్యటనకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. గత 13 నెలలుగా హైదరాబాద్ లో పర్యటనకు సమస్యలు ఎదురవుతున్నట్లు పవన్ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పవన్ పర్యటనపై అభ్యంతరం లేదని చెబుతూనే, ఏపీలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పర్యటనలను అడ్డుకుంటున్నారనే కోణంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ రాష్ట్రంలో విపక్ష వైసీపీకి అస్త్రంగా మారే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

జగన్, రేవంత్ రెడ్డి మధ్య రాజకీయంగా ఎలాంటి సంబంధాలు లేకపోయినా, పవన్ ను ఇరుకన పెట్టేందుకు జగన్ పేరు ప్రస్తావించి పరోక్షంగా ఆయనకు రేవంత్ రెడ్డి సహకరించారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వాడుకుని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తనను అడ్డుకుంటుందని జగన్ రెడ్డి ప్రచారం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు.

# కవిత చేసే డ్యామేజీ ఇన్నాళ్లకు బీఆర్ఎస్ కు అర్థమయిందా?




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కల్వకుంట్ల కవిత పెట్టిన కొత్త పార్టీ బీఆర్ఎస్ కు తలనొప్పిగా మారుతుందని ఆలస్యంగా గ్రహించినట్లుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కవిత తెలంగాణ రక్షణ సేన ను ప్రకటించారు. అంటే టీఆర్ఎస్ గా జనంలోకి వెళ్లేందుకు కవిత నిర్ణయించుకున్నారు. అయితే అది తమకు భారీగా డ్యామేజీ చేస్తుందని భావించిన బీఆర్ఎస్ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. తమ అభ్యంతరాలను తెలియజేస్తూ లేఖను అందచేసింది. తెలంగాణ రక్షణ సేన పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించడంతో బీఆర్ఎస్ రెండు నెలల తర్వాత స్పందించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘా ఈ అభ్యంతరాలను పరిశీలిస్తుంది.

**టఆర్ఎస్ గా జనంలోకి వెళ్లి...**

తెలంగాణ ఉద్యమ పార్టీగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి టీఆర్ఎస్ గా ప్రజల్లోకి వెళ్లింది. వరసగా రెండు పర్యాయాలు విజయం సాధించింది. ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ విజయవంతమయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగిన తర్వాత జరిగిన రెండు ఎన్నికలు అంటే 2014, 2018 లలో వరసగా గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే తర్వాత టీఆర్ఎస్ ను జాతీయ పార్టీగా మార్చాలన్న ఉద్దేశ్యంతో కేసీఆర్ భారత రాష్ట్ర సమితిగా మార్చారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్న తర్వాత 2023లో జరిగిన ఎన్నికల్లో అది ఓటమి పాలయింది. పేరు సెంటిమెంట్ బలంగా పని చేసినట్లు బీఆర్ఎస్ నేతలు గుర్తించారు.

**అదే పేరుతో వెళితే...**

అయితే కల్వకుంట్ల కవిత టీఆర్ఎస్ పేరుతోనే జనంలోకి వెళితే తమకు ఇబ్బందులు తప్పవని భావించిన బీఆర్ఎస్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఇది ఓటర్లలో గందరగోళానికి దారి తీసే అవకాశముందని బీఆర్ఎస్ తన ఫిర్యాదులో పేర్కొంది. టీఆర్ఎస్ అనేది తమకు రాజకీయంగా నష్టం చేకూర్చే అవకాశముందని భావించి ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో మరోసారి టీఆర్ఎస్ పేరు హాట్ టాపిక్ గా మారింది. ఇప్పుడు టీఆర్ఎస్ పేరుపై ఎన్నికల సంఘం అధికారులు పరిశీలిస్తున్నారు. చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో తెలియదు కానీ.. పేరుతో తమకు డ్యామేజీ జరుగుతుందని భావించిన బీఆర్ఎస్ చేసిన ఫిర్యాదుతో ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నది వేచి చూడాల్సిందే.

# అక్రమాస్తుల వేలానికి రంగం సిద్ధం

**హైదరాబాద్ జూన్ 13, పెన్ పవర్:** రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ ప్రతియేటా వందలాది మంది ప్రభుత్వ అధికారులను లంచాలు తీసుకుంటూ లేదా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసుల్లో పట్టుకుంటోంది. సోదాల సమయంలో భారీ మొత్తంలో నగదు, బంగారాన్ని, స్థిరాస్తులు, బ్యాంకు డిపాజిట్లు, ఇతర విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. అయితే, ఈ ఆస్తులు చివరకు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయా? మళ్లీ సంబంధిత వారికి తిరిగి ఇస్తారా.. ఆ ఆస్తులను ఏం చేస్తారు..? ఎక్కడికి తరలిస్తారు అనే విషయాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.వాస్తవానికి ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదును నేరుగా ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ కట్టించి వేలం వేస్తారు. వీటితో పాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్స్ ఫిక్స్డ్ డిపాజిట్లను కోర్టు ఉత్తర్వుల మేరకు.. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల ద్వారా మూసివేస్తారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు బదలీ చేయిస్తారు.ఒకవేళ అక్రమాస్తుల్లో కబ్జాలు చేసినవి గానీ, ప్రభుత్వ భూములు గానీ ఉంటే ప్రత్యేక చట్టం ద్వారా స్వాధీనం చేసుకుని తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తారు. అయితే, ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. అధికారుల అక్రమాస్తులను వేలం వేసిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు లేవని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి వస్తారు. విధి నిర్వహణలో భాగంగా రూ.100 లంచం తీసుకున్నా చట్టపరమైన చర్యలు తప్పవు. లంచం తీసుకుంటూ పట్టుబడిన వారితో పాటు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అధికారులను ఏసీబీ అరెస్ట్ చేసి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటుంది. ఈ సందర్భంగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బినామీ ఆస్తుల వివరాలను కోర్టులో సమర్పిస్తుంది. ఆ తరువాత సంబంధత అధికారికి నోటీసులు జారీ చేసి.. ఆయా ఆస్తులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆదాయ వనరులను వివరించాలని కోరుతుంది. సరైన ఆధారాలు సమర్పించకపోతే ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టం కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తుందికోర్టులో విచారణ పూర్తయిన తరువాత నిందితుడు దోషిగా తేలితేనే అక్రమాస్తులపై తుది చర్యలు ప్రారంభమవుతాయి. లంచాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను నేరాల ద్వారా కూడబెట్టిన ఆస్తులుగా పరిగణించి ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించవచ్చు. ఇళ్లు, ప్లాట్లు వంటి స్థిరాస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం ద్వారా విక్రయించే అవకాశం ఉంటుంది. అలా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తారు.ఏసీబీ సోదాల్లో స్వాధీనం చేసుకున్న నగదును ప్రభుత్వ ఖజానాలో డిపాజిట్ చేస్తారు. బంగారం, వాహనాలకు విలువ నిర్ధారించి కోర్టు అనుమతితో వేలం వేయవచ్చు. షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, ఫిక్స్ డ్ డిపాజిట్లను కూడా చట్ట ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రభుత్వ ఖాతాలకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు ఉన్నతాధికారులను ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఏసీబీ అరెస్టులు చేసింది. వీరిలో కొందరు అధికారులు రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో బయటపడినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు దోషులుగా తేలి, అక్రమాస్తులు వేలం దశకు చేరితే ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతి అధికారులకు ఇదో హెచ్చరికగా ఉంటుందని పేర్కొంటున్నారు.

# ఖమ్మంలో గాయత్రీ రవి టార్గెట్

**ఖమ్మం, జూన్ 13, పెన్ పవర్:** ఖమ్మం జిల్లాలో విజిలెన్స్ దాడులు కలకలం రేపుతున్నాయి. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవికి చెందిన కంపెనీల మీదే వరుసబెట్టి జరుగుతుండటం పొలిటికల్ హాట్ అవుతోంది. ఇదంతా నిజంగానే అక్రమాల వెలికితీత కోసం జరుగుతోందా...? లేక రాజకీయ కక్ష సాధింపులో భాగమా అన్న అనుమానాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయట. వరంగల్ జిల్లాకు చెందిన వద్దిరాజు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ వ్యాపారం ఉంది. బీసీ కాపు సామాజిక వర్గానికి చెందిన రవిమొదట్లో కాంగ్రెస్ అభిమానిగానే ఉన్నారు. 2018లో ఆ పార్టీ వరంగల్ తూర్పు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చిందిగానీ విజయం సాధించలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాక రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు కేసీఆర్. ఆ పదవీకాలం రెండేళ్ళే కావడం, ముగిసిపోవడంతో తిరిగి ఆయనకే రెన్యువల్ చేశారు. ఈ పరిస్థితుల్లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో వద్దిరాజును తమ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని అనుకున్నారట కాంగ్రెస్‌లోని కొందరు. అందుకు ఆయన ఒప్పుకోకపోగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారన్న కోపంతో అధికార పార్టీ ఇప్పుడు టార్గెట్ చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి పొలిటికల్ సర్కిల్స్‌లో. కేసీఆర్, హరీష్‌రావు లాంటి అగ్ర నాయకులకు దగ్గరగా ఉండే గాయత్రి రవిని బీఆర్ఎస్‌కు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే కొద్ది రోజులుగా ఆయనకు చెందిన గ్రానైట్ కంపెనీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇవి ఎక్కడా బయటికి ఎక్స్‌పోజ్ అవకుండా జాగ్రత్త పడ్డారట అధికారులు. మరోవైపు కొంతకాలంగా... ఖమ్మం జిల్లా కారును గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల, సండ్ర వెంకటవీరయ్య కలిసి నడిపిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్నందునే గాయత్రి రవి టార్గెట్ అయ్యారా అన్న అనుమానాలు కూడా చాలామందికి ఉన్నాయట. జిల్లాలో ఉన్న ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని టార్గెట్ చేసేలా అధికార పార్టీ పావులు కదుపుతోందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. అటు గతంలో కాంగ్రెస్ నేతలకు అత్యంత ఆప్తుడిగా ఉండేవారు రవి. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఒక మినిస్టర్‌కు అప్పట్లో రైట్ హ్యాండ్‌లా ఉండేవారాయన. ఇప్పుడు తనకు ఎదురవుతున్న సమస్యలు, వేధింపుల గురించి వద్దిరాజు రవిచంద్ర సదరు మంత్రికి చెప్పుకున్నా నా చేతిలో ఏమీ లేదని ఆయన అన్నట్టు తెలిసింది. మరోవైపు వచ్చే అసెంబ్లీ... ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యే సీట్లో రవి పోటీ చేస్తారన్న ప్రచారం సైతం ఉంది. ఇక ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బంధువులు నిర్వహిస్తున్న దుకాణ సముదాయానికి కూడా అధికారులు నోటీసులు ఇచ్చారట. వాటి వెనుక సైతం అధికార పార్టీ నేతల వత్తిడి ఉందని ఆఫ్ ద రికార్డ్‌లో అజయ్ అంటున్నారట. అయితే దాన్ని ఇష్యూ చేయడం వల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ ఉండదన్నది ఆయన అభిప్రాయం. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా పాలిటిక్స్‌లో అజయ్ వర్సెస్ గాయత్రి రవి అన్నట్టుగా కూడా వ్యవహారాలు నడిచాయి. ఆ సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం నడుస్తున్న విజిలెన్స్ వ్యవహారాలను గాయత్రి రవి ఎలా ఎదుర్కొంటారోనని చూస్తున్నాయి రాజకీయవర్గాలు.

# బోధన్ లో కనిపించని షకీల్

**నిజామాబాద్, జూన్ 13 పెన్ పవర్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్ఛార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ... మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్ఎస్ఎక్కడికక్కడ ఇన్ఛార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్ఛార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు... పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ... ఇంకోసారి దుబాయ్ ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో... తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్థంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్ఛార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

# మేలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.93 శాతం.. ఏప్రిల్ లోని 3.48 శాతం నుంచి పెరుగుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆహార, ఇంధన ధరలు పెరగడంతో ఇండియా రిటైల్ ఇన్‌ఫ్లేషన్ (కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్- సీపీఐ) మే నెలలో 3.93 శాతానికి చేరింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. ఏప్రిల్‌లోని 3.48 శాతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఇది రాయిటర్స్ అంచనా వేసిన 4 శాతం కంటే తక్కువగా ఉంది. అంతేకాకుండా, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెట్టుకున్న 4శాతం మిడ్‌టర్మ్ టార్గెట్ కంటే దిగువన నమోదైంది. రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లోని 4.20శాతం నుంచి మే నెలలో 4.78 శాతానికి పెరిగింది. ఇందులో టమాటో ధరలు ఏకంగా 48.43శాతం పెరగ్గా, బంగాళాదుంపల ధరలు 23.71శాతం తగ్గాయి. విద్యుత్, గ్యాస్, ఇంధన ధరల వృద్ధి 0.81శాతానికి చేరింది. గత వారం జరిగిన పాలసీ సమావేశంలో ఆర్‌బీఐ తన రెపో రేటును 5.25శాతం వద్ద స్థిరంగా ఉంచినప్పటికీ, పెరుగుతున్న ముడి చమురు ధరలు, రుతుపవనాల అనిశ్చితి కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్యోల్బణం అంచనాను 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హస్తినకు రాములమ్మ...



**హైదరాబాద్, జూన్ 13, పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్ నేత విజయశాంతి పార్టీ వైపు చూడటం లేదు. పదవిలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ అంతే. కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. కానీ ఎమ్మెల్సీ పదవితో ఆమె సంతృప్తికరంగా లేనట్లు కనపడుతుంది. తన రేంజ్ కు మంత్రి పదవి దక్కాలన్న యోచనలో విజయశాంతి ఉన్నారని చెబుతున్నారు. అందుకే విజయశాంతి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. శాసనమండలి సమావేశాలకు మాత్రమే హాజరవుతూ మొక్కుబడిగా ప్రశ్నలు వేస్తున్నారు. మొన్న జరిగిన శాసనమండలి సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడి మరోసారి విజయశాంతి తన అక్కసును వెళ్లగక్కారు.కాంగ్రెస్ లో త్వరలో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతుంది. అయితే అన్ని రకాల అర్హతలున్న తనకు మంత్రి పదవి ఎందుకు దక్కడం లేదన్నది ఆమె సన్నిహితుల వద్ద ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. నిజానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విజయశాంతి పేరు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అసలు విజయశాంతి పేరును ఎవరూ ఊహించ లేదు. ఢిల్లీలో ఉండి మల్లికార్జున ఖర్గేను కలిసినప్పటికీ ఆమె పేరు ఖరారు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎవరూ భావించలేదు. నేరుగా హైకమాండ్ ను కలసి తనకు ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్న ఘనత విజయశాంతిది. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లి అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేరుగా రాహుల్ ను కలసి తమకు మంత్రిపదవి ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో రాములమ్మ కూడా హస్తిన బాట పడుతున్నారన్న టాక్ వినపడుతుందిఎమ్మెల్సీ వచ్చిన ఆనందం మాత్రం ఆమెలో కనిపించడం లేదు. తాను మంత్రి పదవికి పూర్తి స్థాయిలో అర్హత కలిగిన నేతనంటూ మరోసారి ఢిల్లీకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఇక్కడి నేతలతో సంబంధం లేకుండా నేరుగా ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ ను కలసి తన మంత్రి పదవి చర్చించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తనకు మంత్రి పదవి ఇస్తే తాను పార్టీకి ఏం చేయదలచుకున్నానో.. కూడా హైకమాండ్ కు నివేదించేందుకు ఒక బ్లూ ప్రింట్ ను కూడా సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద విజయ శాంతి ఎమ్మెల్సీగానే ఊహించని విధంగా అయినప్పుడు మంత్రి కావడంలో పెద్దగా ఎవరూ నోరు వెళ్లబెట్టాల్సిన పనిలేదంటున్నారు సొంత పార్టీ నేతలు.

**ఆగని అంతర్గత పోరు**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కారానికి గురయింది. అయితే అందుకు తెలంగాణాలో నమోదయిన కేసు కారణమని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. అఫడవిట్ లో కేసు గురించి పేర్కొనకపోవడంతో మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల అధికారులు మీనాక్షి నామినేషన్ ను తిరస్కరించారు. అయితే తెలంగాణలో ఆమెపై కేసు నమోదు కాలేదు. కేవలం ఒక కేసులో న్యాయస్థానం సమన్లు మాత్రమే జారీ చేసింది. ఇవన్నీ పక్కన పెడితే అసలు తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పై కేసు ఉన్నట్లు మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు ఉప్పు అందించిందెవరు? అన్నదే ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారింది.మీనాక్షి నటరాజన్ స్ట్రయిట్ ఫార్వార్డ్ నేత. నిరాడంబరంగా ఉంటారు. ఖరీదైన జీవితాన్ని కూడా ఆశించరు. దీపా మున్షీ దాస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీనాక్షి నటరాజన్ కు తెలంగాణ కాంగ్రెస్ ఇన్ ఛార్జి బాధ్యతలను అప్పగించింది. ఆమె తెలంగాణ కాంగ్రెస్ లో ఇన్ ఛార్జి పదవి తీసుకున్న వెంటనే ఒకే మాట చెప్పారు. పార్టీకి నమ్మకంగా ఏళ్ల నుంచి పనిచేసిన వారికే ప్రథమంగా గుర్తింపు ఉంటుందని, ఎన్నికలకు ముందు వచ్చిన వారికి పదవులు తర్వాత ఇస్తామని నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో పాటు ఆమె కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరగలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి నివేదికలను అందిస్తున్నారన్న అనుమానం ఇక్కడి నేతలకు ఉంది.మీనాక్షి నటరాజన్ పార్టీ ఇన్ ఛార్జిగా పదవి బాధ్యతలను తీసుకున్న తర్వాత తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీలో శత్రువులు పెరిగారన్నది అంతే వాస్తవం. మధ్యప్రదేశ్ బీజేపీ నేతలు సయితం నామినేషన్ తిరస్కారానికి గురైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ తమకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే మీనాక్షి నటరాజన్ పై బీజేపీ నేతలకు సమాచారం ఇచ్చెందవరు? అన్నదానిపై ఇప్పుడు కాంగ్రెస్ లో పోస్టుమార్టం జరుగుతుంది. కానీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాత్రం తెలంగాణ కాంగ్రెస్ నుంచి ఎవరూ సమాచారం ఇవ్వలేదని, కేవలం తెలంగాణ బీజేపే నేతలు ఇచ్చిన సమాచారంతోనే వారు ఫిర్యాదు చేశారంటున్నారు. మొత్తం మీద మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్ లో ప్రకంపనలు పుట్టిస్తుంది.

# ఇకపై డిజిటల్ పౌర సేవల కేంద్రాలుగా సహకార సంఘాలు

**నల్గొండ, జూన్ 13, పెన్ పవర్:**
గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక చిన్న సర్టిఫికేట్ కోసమో, పాస్‌పోర్ట్ దరఖాస్తు కోసమో పట్టణాల్లోని మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగే రోజులకు త్వరలోనే తెరపడనుంది. గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలనే ఇకపై మల్టీ సర్వీస్ డిజిటల్ హబ్‌లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ డిజిటల్ భారత్ చొరవతో, నాబార్డు సమన్వయంతో రూపుదిద్దుకుంటున్న ఈ సరికొత్త కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా.. ఆధార్, పాన్ కార్డు సేవలతో పాటు వందలాది ప్రభుత్వ, ప్రైవేటు సేవలను రైతుల వద్దకే తెస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న డిజిటల్ పని కోసమైనా, ప్రభుత్వ సేవలను పొందాలన్నా మండల కేంద్రాలకో లేదా పట్టణాలకో పరుగులు తీసే రోజులు త్వరలోనే కానరాకుండా పోనున్నాయి. ఇకపై మీ గ్రామంలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారానే సమస్త డిజిటల్ పౌర సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ సంఘాలన్నింటినీ కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాలు అంటే కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయడానికే పరిమితం అనే భావన ఉంది. అయితే వీటికి పూర్తిస్థాయిలో డిజిటల్ హంగులు అద్ది, డిజిటల్ భారత్ పథకంలో భాగంగా గ్రామీణులకు అవసరమైన అన్ని రకాల సామాజిక, సంక్షేమ, విద్యా, ఆరోగ్య సేవలను ఒకే చోట అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కేంద్ర సహకార శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ, నాబార్డుల మధ్య జాతీయ స్థాయిలో కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సరికొత్త డిజిటల్ విప్లవం ద్వారా పీఏసీఎస్‌లు కేవలం వ్యవసాయ కేంద్రాలుగానే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే డిజిటల్ హబ్‌లుగా రూపాంతరం చెందనున్నాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని ఈ ఏడాది ఆఖరు నాటికి వంద శాతం కామన్ సర్వీస్ సెంటర్లుగా మార్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే తొలి విడతగా రాబోయే ఆగస్టు 15వ తేదీ నాటికి 562 సంఘాల్లో సేవలను ప్రారంభించేందుకు ఐటీ శాఖ మద్దతుతో లైసెన్సులు, ఆన్‌లైన్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటికే 15 కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. అలాగే డిజిటల్ సేవలతో పాటుగా ప్రభుత్వ, వ్యాపార విభాగాలు కూడా ఇక్కడే కొలువుదీరనున్నాయి.అయితే ఈ కామన్ సర్వీస్ సెంటర్లలో ఆధార్ కార్డు అప్‌డేట్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ దరఖాస్తులు, ఓటరు గుర్తింపు కార్డులు, జనన మరణాల నమోదు చేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, భూసార పరీక్ష కార్డులు, డెయిరీ, మత్స్య పరిశ్రమ సేవలు, రేషన్, గోదాముల నిర్వహణ వంటి సేవలను కూడా అందిస్తారు. అలాగే జీవన్ ప్రమాణ్ పత్రాలు, శ్రమయోగి మాన్‌ధన్ పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, ఐటీ రిటర్నుల దాఖలు, జీవిత బీమా, విద్యుత్, నీటి బిల్లుల చెల్లింపులు, వాహన్, ఈ చలాన్, ఈ స్టాంపుల జారీ, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్ సదుపాయం కూడా ఇక్కడ లభిస్తుంది.వీటన్నింటితో పాటు భవిష్యత్తులో ఈ సహకార సంఘాలను జన ఔషధి కేంద్రాలుగా మార్చి.. రాయితీ ధరలపై నాణ్యమైన ఔషధాలను విక్రయించడానికి కూడా ప్రత్యేక లైసెన్సులు మంజూరు చేయనున్నారు. ఈ చొరవతో గ్రామీణ ప్రజల సమయం, డబ్బు భారీగా ఆదా కానున్నాయి.

# పబ్లిక్ గార్డెన్ టూ లక్డీకాపూల్ 1.5 కిలోమీటర్ల వై షేప్ లో ఫ్లైఓవర్

**హైదరాబాద్ జూన్ 13, పెన్ పవర్:**
హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా కోర్ సిటీ పరిధిలోని నాంపల్లి, అసెంబ్లీ, లక్డీకాపూల్ మార్గాల్లో నిత్యం నరకంగా మారుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి సరికొత్త ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రతిపాదించింది. పబ్లిక్ గార్డెన్ నుంచి అసెంబ్లీ వెనుక వైపుగా లక్డీకాపూల్ వరకు దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున ఆంగ్ల అక్షరం " (వై) ఆకారంలో నిర్మించ తలపెట్టిన ఈ వంతెనకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రణాళికలు, డిజైన్లను సిద్ధం చేసింది.సాధారణంగా నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణాల సమయంలో ప్రైవేటు ఆస్తుల సేకరణ పెద్ద సవాలుగా మారుతోంది. భూసేకరణ కారణంగా కోర్టు కేసులు, పరిహారం వివాదాలు తలెత్తి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యం అవుతున్నాయి. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఈ ప్రతిపాదిత వంతెనను గరిష్ఠంగా ప్రభుత్వ భూముల్లోనే నిర్మించేలా అధికారులు చాకచక్యంగా ప్లాన్ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో హెచ్ఎండీఏ ఇప్పటికే సమగ్ర సర్వేను పూర్తి చేసింది. దాదాపు 99 శాతం వరకు ప్రభుత్వ ఆస్తులను కేటాయించింది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్తుల అవసరం ఎక్కువగా లేకుండా, ఎక్కడా వివాదాలకు తావులేకుండా ఈ ఫ్లైఓవర్ అలైన్‌మెంట్‌ను రూపొందించింది.ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్ నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ముందు భాగం నుంచి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి పబ్లిక్ గార్డెన్ మీదుగా, అసెంబ్లీ వెనుక వైపు నుంచి రైల్వే లైన్ వెంబడి ముందుకు సాగుతుంది. లక్డీకాపూల్ వద్దకు చేరుకోగానే ఈ వంతెన రైల్వే లైన్ మీదుగా ప్రయాణించి లక్డీకాపూల్ జంక్షన్‌ను దాటుతుంది. ఇక్కడే అసలు ఇంజినీరింగ్ అద్భుతం జరగనుంది. జంక్షన్ దాటిన తర్వాత ఈ ఫ్లైఓవర్ రెండుగా చీలిపోతుంది. అంటే 'వై' షేప్‌గా మారుతుంది. ఇందులో ఒక మార్గం నేరుగా మాసబ్ ట్యాంక్ వైపు వెళ్లే రహదారికి, మరో మార్గం ఖైరతాబాద్ వైపు వెళ్లే రహదారికి అనుసంధానం అవుతుంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కంటే ముందే లక్డీకాపూల్ ప్రధాన రహదారిపై ఈ వంతెన ల్యాండ్ అయ్యేలా డిజైన్ చేశారు.హైదరాబాద్-విజయవాడ

రహదారికి అనుసంధానంగా ఉండే ఈ కోర్ సిటీ రూట్‌లో భారీ వాహనాల రాకపోకల వల్ల రాత్రి వేళల్లోనూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో విధించే ఆంక్షల వల్ల వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కొత్త వంతెన అందుబాటులోకి వస్తే నాంపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు ఖైరతాబాద్ లేదా మాసబ్ ట్యాంక్ వైపు సిగ్నల్ ఫ్రీగా వెళ్లవచ్చు. అయితే, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దీనిని పూర్తిగా 'వన్-వే'గా మార్చనున్నారు. నాంపల్లి నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే దీనిపై అనుమతి ఉంటుంది. ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ నుంచి వచ్చే వాహనాలను దీనిపైకి అనుమతించరు.

# అగ్రికల్చర్ లోహాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానం..

**అనంతపురం, జూన్ 13, పెన్ పవర్:**
ఉమ్మడి అనంతపురం జిల్లా.. కరవుకు కేరాఫ్ అడ్రస్.. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. ఏళ్ల తరబడి కరువు కాటకాలు వేధిస్తున్నా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, భూమాతపై నమ్మకంతో వ్యవసాయాన్నే నమ్ముకుని ధైర్యంగా ముందడుగు వేసే రైతన్నలు ఎందరో. కానీ కాలం మారుతోంది. అనంత రైతులు టెక్నాలజీ బాట పడుతున్నారు. మూస ధోరణి వీడి.. సరికొత్త సాంకేతిక పద్ధతులతో సాగులో అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ విధానాలను పక్కనబెట్టి హార్టీకల్చర్, పండ్ల తోటల సాగులో రాణిస్తున్నారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ విధానాన్ని ఎక్కువగా ఆఫ్రికా దేశాలలో ఉపయోగిస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఈ విధానం ద్వారా వ్యవసాయం చేపడుతుంటారు. హాఫ్ మూన్ స్ట్రక్చర్ అంటే.. కొండకు వాలుగా ఉన్న పొలాలలో అర్ధ చంద్రాకారపు ఆకారంలో గుంతలు తవ్వడం. సాధారణంగా ఈ గుంతలు ఒకటి నుంచి రెండు మీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చు. అలాగే నేల సారవంతాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు భారీగా పెట్టుబడులు లేకుండానే బీడు భూములను పునరుద్ధరించుకోవచ్చు. ఇలా కొండకు వాలుగా గుంతలు తవ్వటం ద్వారా వర్షం కురిసినప్పుడు ఆ వర్షపు నీరు వీటిలో చేరి అక్కడే ఇంకిపోతుంది. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ విధానం అనుసరిస్తుంటారు.అలాంటి ఓ రైతే ప్రమీలమ్మ. ఆఫ్రికా దేశంలో అనుసరించే హాఫ్‌మూన్ విధానంతో గత ఎనిమిది సంవత్సరాలుగా పంటలు సాగు చేస్తూ రోజువారీ ఆదాయం పొందుతున్నారామె. తన సక్సెస్ స్టోరీతో ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి కూడా అభినందనలు అందుకున్నారు ప్రమీలమ్మ.కళ్యాణదుర్గం మండలంలోని భట్టువానిపల్లికి చెందిన ప్రమీలమ్మకు మూడు ఎకరాల పొలం ఉంది. అర ఎకరంలో ఏ - గ్రేడ్ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు ప్రమీలమ్మ. మిగతా రెండున్నర ఎకరాలలో వేరుసెనగ పంట పండిస్తున్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తూ రసాయనాలకు దూరంగా సొంతంగా తయారుచేసుకున్న జీవామృతాన్ని పిచికారీ చేస్తూ పంటలు సాగు చేస్తున్నారు. ఏ గ్రేడ్ విధానంలో సాగుచేసే ఆకుకూరలు, కూరగాయలతో రోజూ ఆదాయం పొందుతున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తూ ఉండటంతో ప్రమీలమ్మ ఇంటివద్దకే వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రమీలమ్మ గురించి తెలిసిన సీఎం చంద్రబాబు జలహారతి కార్యక్రమంలో ఆమెను అభినందించారు.ఏ గ్రేడ్ సాగు అనేది ప్రకృతి వ్యవసాయంలో ఒక పద్ధతి. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో, ఒకే సమయంలో ఎక్కువ దిగుబడి పొందవచ్చు. ఒకే పొలంలో, ఒకే సమయంలో ప్రధాన పంటతో పాటుగా అనుబంధంగా మరో మూడు లేదా నాలుగు పంటలు సాగు చేయడాన్ని ఏ గ్రేడ్ మోడల్ అని పిలుస్తుంటారు. ఈ రకంగా వివిధ రకాల పంటలను పండించటం ద్వారా నేల సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. అలాగే అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే రోజూవారీ ఆదాయం కూడా పొందవచ్చని చెప్తున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ మధ్యకాలంలో ఈ విధానం పెరుగుతోంది.

# డేటా సెంటర్లు...
# 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ కు ప్లానింగ్

**విశాఖపట్టణం, జూన్ 13 పెన్ పవర్:**
ఏపీలోని విశాఖపట్టణం డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతోంది. ఆ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, డేటా సెంటర్లకు లోటులేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డేటా సెంటర్ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీర్ఘకాలిక పవర్ ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్‌ను రూపొందించింది. రాబోయే పదేళ్లలో డేటా సెంటర్ల విద్యుత్ అవసరం దాదాపు 15 గిగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో డేటా సెంటర్లకు లోటు లేకుండా విద్యుత్ ను అందించేందుకు ప్రణాళికలపై చర్చించారు. విశాఖపట్టణం ప్రాంతంలో ప్రస్తుతం 16భారీ డేటా సెంటర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని ఏపీ ట్రాన్స్‌కో అంచనా వేసింది. వీటి ద్వారా సుమారు 9.1 గిగావాట్ల ఐటీ విద్యుత్ లోడ్ ఏర్పడనుండగా.. అనుబంధ మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అవసరాలను కలుపుకుని మొత్తం విద్యుత్ డిమాండ్ 2036–37 నాటికి 15 గిగా వాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవసరాలను తీర్చేందుకు 765 కేవీ, 400 కేవీ, 220 కేవీ స్థాయిల్లో ట్రాన్స్ మిషన్ నెట్ వర్క్ ను అభివృద్ధి చేసేందుకు అధికారులు నిర్ణయించారు.ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అభివృద్ధి కోసం పెందుర్తి, అచ్యుతాపురం, పలాస, పద్మనాభం, మాకవారిపాలెం వంటి కీలక సబ్ స్టేషన్లను అనుసంధానించేలా ఈ వ్యవస్థను నిర్మించనున్నారు. ఈ నెట్‌వర్క్ 2034 నాటికి 15 గిగావాట్లకుపైగా డేటా సెంటర్ లోడ్‌ను మోయగల సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. ఈ ప్రణాళికలో భాగంగా రాంబిల్లి డేటా సెంటర్ క్లస్టర్ అభివృద్ధిపైనా అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ ప్రాంతంలో భారీ పెట్టుబడుల కోసం కొత్త 400 కేవీ, 200 కేవీ సబ్ స్టేషన్లతో పాటు అధిక సామర్థ్యం కలిగిన ప్రత్యేక విద్యుత్ ప్రసార మౌలిక వసతులు, ట్రాన్స్ మిషన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా తార్లువాడ, ముడసర్లోవ, పోలేపల్లి, చిన్నిపాలెం ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ హబ్‌ల కోసం అవసరమైన విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.గూగుల్, రిలయన్స్, టీసీఎస్ హైపర్‌వాల్ట్, సీటీఆర్ఎల్ఎస్ , జీఎంఆర్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై ఆసక్తి చూపుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక వసతుల కేంద్రంగా నిలబెడతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# జగన్ కు పాజిటివ్ గా మారుతోందా..

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పటిష్టమైన ఓటు బ్యాంకు ఉంది. అది వచ్చే ఎన్నికల్లోనూ చెక్కు చెదరదన్న నమ్మకంతో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. దీంతో పాటు తమకు అదనంగా మరికొంత బలం తోడవుతుందని, తద్వారా తన గెలుపు ఖాయమని భావిస్తున్నారు. అందుకే అధికార పక్షంపై జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. నేరుగా చంద్రబాబుతో పాటు ఆయన కుమారుడు లోకేశ్ లపైన కూడా విమర్శలు చేస్తూ పాలనలో లోటుపాట్లను మీడియా సమావేశాల ద్వారా బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో తనకు దూరమైన వర్గాలు తిరిగి తన చెంతకు చేరతాయని నమ్ముతున్నారు.గత ఎన్నికల్లో మధ్యతరగతి ప్రజలతో పాటు, రెడ్డి సామాజికవర్గంలోనూ ఓట్లు చీలిపోయాయి. ఉన్నత వర్గాల ఓట్లు ఎటూ రాలేదు. దీంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డం తిరిగారు. తమపై పనిభారం మోపడంతో పాటు తమకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడం, ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు దాదాపు 90 శాతం మందికిపైగా నాటి ఎన్నికల్లో కూటమి వైపునకు మొగ్గు చూపారు. అయితే ఇప్పుడు తనకు దూరమైన అన్ని వర్గాల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఉందని జగన్ భావిస్తున్నారు. ఈ అదనపు బలం దాదాపు పదిశాతం ఓట్లు తనకు యాడ్ అవుతాయని తన సన్నిహితుల వద్ద లెక్కలు చెబుతున్నారని తెలిసిందిగత ఎన్నికల్లో తన సొంత సామాజికవర్గం లో కూడా అసంతృప్తి ఉంది. అయితే ఇప్పుడు



పరిస్థితులు మారాయి. రెడ్డి సామాజికవర్గంలో జగన్ పాట్ల సానుభూతి వచ్చిందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గత ప్రభుత్వమే మేలన్న అభిప్రాయంలో ఉన్నారని జగన్ భావిస్తున్నారు. అందుకే ఈ సారి ఎన్నిలకు ముందు జగన్ కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సారి జగన్ హామీలు కూడా భారీగా ఉంటాయని అంటున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులకు సంబంధించి కీలక హామీలను ప్రకటిస్తారని, అందుకే జగన్ అన్ని లెక్కలు వేసుకునిఈసారి తనదే అధికారమన్న ధీమాలో ఉన్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

# నయా స్ట్రాటజీతో జనసేనాని

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:**
జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ఆలోచన అంతా కొత్త ఓటు బ్యాంకుపైనే ఉంది. యువ ఓటర్లపైనే ఆయన ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కొత్తతరం ఓటర్లు లక్షల సంఖ్యలో వస్తారు. వారే ఎన్నికల్లో విజయానికి కీలకంగా మారనున్నారు. గెలుపులో యువత కీలక భూమిక పోషిస్తుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తనకు కులాలు అంటగట్టవద్దని పదే పదే కోరుతున్నారు. తనను ఒక కులానికే ముద్ర వేసి చూడవద్దని, అందరూ ఓట్లు వేస్తేనే తాను గెలిచానని పవన్ కల్యాణ్ పదే పదే గుర్తు చేస్తున్నారు. దీని వెనక పవన్ ఆలోచన రాబోయే యువతరం ఓట్లను ఆకట్టుకునేందుకేనన్నది ఆయన నయా స్ట్రాటజీగా తెలుస్తుంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబును పక్కన పెడితే .. టీడీపీలో లోకేశ్, వైసీపీలో జగన్, జనసేనలో పవన్ అందరూ చిన్న వయసు వాళ్లే. అందరికంటే లోకేశ్ వయసులో చిన్న అయినప్పటికీ రాజకీయాల్లోకి వచ్చేసరికి మిగిలిన ఇద్దరూ కూడా యూత్ లీడర్ల కిందే లెక్క. అయితే ఈ ముగ్గురిలో యూత్ తనకు కనెక్ట్ అవ్వాలన్నది జనసేనాని ఆలోచనగా ఉంది. పవన్ కల్యాణ్ పై అవినీతి ముద్ర లేదు. మాట మీద నిలబడి ఉండరన్న పేరు తప్ప.. పవన్ కల్యాణ్ పై రెటువంటి చెడు అభిప్రాయం లేదు. మరొకవైపు పవన్ కల్యాణ్ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం పనిచేస్తారని, రాజకీయాల కంటే ఎక్కువగా అభివృద్ధి పనులపై ఫోకస్ పెడతారన్న పేరు తెచ్చుకోవాలన్న తాపత్రయంలో పవన్ కల్యాణ్ ఉన్నారు.ఇప్పటికే ఓటర్ల సమగ్ర సవరణ ప్రారంభం కానుంది. చాలా వరకూ ఓట్లు పోతాయి. 2029 ఎన్నికల్లో కొత్త ఓటర్లు వచ్చి చేరతారు. వారిని టార్గెట్ చేసుకుని తాను ముందుకు వెళితే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వస్తాయని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. తమిళనాడులో విజయ్ కు యువత, మహిళలు ఎక్కువగా కనెక్ట్ కావడంతోనే పార్టీ పెట్టిన ఏడాదిన్నరకే అధికారంలోకి వచ్చారు. అలాంటిది ప్రయత్నిస్తే తాను ఎందుకు కాలేనన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అందుకే ఆయన సొంత సామాజికవర్గాన్ని కూడా దూరం చేసుకునేందుకు సిద్ధమయ్యారన్న టాక్ జనసేన వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. మొత్తం మీద పవన్ కల్యాణ్ యువతను ఎంత మేరకు ఆకట్టుకుంటారన్నది భవిష్యత్ లో తేలనున్నప్పటికీ ఆయన ఆలోచన మాత్రం విభిన్నంగా సాగుతుందనే చెప్పాలి.

# రాయలసీమలో లిమిటేషన్ రచ్చ

**తిరుపతి, జూన్ 13, పెన్ పవర్:** మరోసారి నియోజకవర్గాల పునర్విభజన అంశం తెరపైకి వచ్చింది. మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ బిల్లుతోపాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లు వెనక్కి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంతో పునర్విభజన బిల్లును వెనక్కి తీసుకుంది కేంద్రం. అయితే ఎట్టి పరిస్థితుల్లో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గ రాజకీయ పరిస్థితులు కలిసి వస్తున్నాయి. బెంగాల్ తో పాటు తమిళనాడులో లోక్సభ సభ్యుల బలం ఎన్డీఏకు అదనపు బలంగా మారనుంది. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నిన్ననే తాజా వర్కింగ్ పేపర్ నియోజకవర్గాల పునర్విభజనపై విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలు పెరగడంతో పాటు ఏపీలో కూడా పెరిగే ఛాన్స్ ఉంది. ఇప్పుడు ఉన్న 25 పార్లమెంట్ స్థానాలకు గాను మరో పదమూడు సీట్లు పెరుగుతాయి. అయితే సింహభాగం పెరుగుదల అనేది రాయలసీమలో కావడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.కొంతకాలంగా తీవ్ర అధ్యయనం చేసిన ఈ ఆర్థిక మండలి తన నివేదికను బయటపెట్టింది. కొత్త ప్రతిపాదనలను పెట్టింది. వీటిని చూస్తే పునర్విభజనతో ఎక్కువగా లాభపడేది రాయలసీమ. అత్యంత ప్రతిష్టాత్మకమైన లోక్ సభ స్థానాలుగా ఉన్న కడప, కర్నూలు, అనంతపురం, రాజంపేట నియోజకవర్గాల పరిధి చాలా పెద్దదిగా ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానాన్ని మూడు గా విభజిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి అభిప్రాయపడింది. ఈ నాలుగు సీట్ల పరిధిలో మరో 8 పెరగనున్నాయన్నమాట. ఇదే జరిగితే భవిష్యత్తులో దేశ రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అధికార పీఠాన్ని శాసించడంలో రాయలసీమ విపరీతమైన ప్రభావం చూపి అవకాశం ఉంది.రాయలసీమలో పునర్విభజనతో ఎనిమిది పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. అయితే ఉత్తరాంధ్రలో మాత్రం కేవలం రెండు లోక్ సభ సీట్లు పెరిగే ఛాన్స్ కనిపిస్తోంది. విశాఖ గ్లోబల్ సిటీగా మారుతున్న తరుణంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మూడుగా విభజించాలని ఈ మండలి ప్రతిపాదించింది. అంటే విజయనగరం, శ్రీకాకుళంలో ఉన్న పార్లమెంట్ స్థానాలను యధాతధంగా ఉంచి.. విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఓ రెండు స్థానాలను విభజించి పెంచుతారు అనేది ఈ ప్రతిపాదనల సారాంశం. అయితే ఆశ్చర్యకరంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా, రాజకీయ ప్రాధాన్యత కలిగిన కోస్తాంధ్ర, నెల్లూరు, ప్రకాశం జిల్లాలో మాత్రం ఇప్పుడున్న సీట్లను యధాతధంగా ఉంచాలని ఈ నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. కోస్తా జిల్లాల్లో జనాభా నియంత్రణ ప్రమాణాలు స్థిరంగా ఉండటం, నియోజకవర్గాల భౌగోళిక పరిమితులు ఓటర్ల సంఖ్యకు అనుకూలంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2027 జనాభా లెక్కల ప్రకారం ఈ పునర్విభజన చేపడితే రాజకీయంగా రాయలసీమ మరోసారి పై చేయి సాధించే అవకాశం ఉంది. దాదాపు 13 పార్లమెంటు స్థానాలు పెరగడంతో అన్ని పార్టీల్లో ఆశావహులకు అవకాశాలు దక్కుతాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫీల్ గుడ్ సరే... వీటి సంగతేంటీ...

**విజయవాడ, జూన్ 13, పెన్ పవర్:** అధికారాన్ని కోల్పోయిన తర్వాత వైసీపీలో విపరీతమైన నిరాశ కనిపిస్తోంది. అందువల్లే ఏ మాత్రం అవకాశం దొరికినా సరే వదిలిపెట్టకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. జరిగింది ఇసుకంత అయితే.. దానిని పెద్ద బండరాయి లాగా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇది కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. అయితే ఇటువంటి లోపాల మీద కూటమి ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోతే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.అభివృద్ధి, సంక్షేమం అని చెబుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం కచ్చితంగా వీటి మీద దృష్టి పెట్టాలి. అన్ని రకాలుగా పింఛన్లను భారీగా పెంచామని ప్రభుత్వం చెబుతోంది. కానీ రెండు సంవత్సరాల కాలంలో ఇంతవరకు కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్తగా ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. గృహాలను కూడా నిర్మించలేదు. నాడు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అనర్హులకు పింఛన్లు ఇచ్చారు. వారిపై ఇంతవరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రీసర్వే సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. క్వాంటం వ్యాలీ.. డేటా సెంటర్లు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల సామాన్యులకు ఏ విధమైన ఉపయోగం లభిస్తుందో వివరించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం మీద ఉన్నది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగుల జీతాలు ఆలస్యం అయ్యేవి. విశ్రాంత ఉద్యోగుల పింఛన్లు కూడా సరిగా వచ్చేవి కాదు. పిఆర్సి అమల్లో జగన్ ప్రభుత్వం మొండిగా ఉండేది. చివరికి సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ వెనుకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల విషయంలో సానుకూల ధోరణితో కనిపిస్తోంది. వేల కోట్ల బకాయిలు విడుదల చేసింది. ఉద్యోగుల సమస్యల మీద దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.అమరావతి నిర్మాణంలో ప్రభుత్వం ఇంకా వేగం పెంచాల్సి ఉంది. కొన్ని విషయాల పట్ల పాఠాలు నేర్చుకోవాలి. ముఖ్యంగా ప్రభుత్వ భవనాలు.. సముదాయాల నిర్మాణం మీదనే ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే పబ్లిక్ యాక్టివిటీ లో వేగం పెరగాలంటే కచ్చితంగా లే అవుట్లు డెవలప్ కావాలి. అవి లేకుండా అమరావతిలో ఎవరు కూడా ఇల్లు కట్టుకునే సాహసం చేయరు. వ్యాపారాలు ప్రారంభించలేరు.వైసీపీ పరిపాలనలో ఏపీ రాష్ట్రంలో ఆర్థిక లోటు పెరిగిపోయింది. సంక్షేమ పథకాలకు మాత్రమే నిధుల సర్దుబాటు జరుగుతోంది. అభివృద్ధి పనుల విషయంలో కాస్త ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతోంది. అప్పుల మీదనే ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువల్ల అప్పుల భారం పెరిగిపోతుంది. వీటివల్ల కీలకమైన పథకాల అమలు సాధ్యం కావడం లేదు. ఉదాహరణకు ఎన్టీఆర్ వైద్య సేవ బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఈ పథకానికి నిధుల సర్దుబాటు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా అధికారులు వ్యవహరించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అలానే కొనసాగుతోంది. పొలిటికల్ గవర్నెన్స్ ను అమలు చేయాలని చంద్రబాబు చెబుతున్నప్పటికీ అధికారులు వినిపించుకోవడం లేదు. కన్సల్టెంట్లు ప్రభుత్వంలో హవా కొనసాగిస్తున్నారు. కన్సల్టెంట్లు చెప్పిన మాటనే ప్రభుత్వం పాటిస్తోంది.. కొన్ని సందర్భాలలో కన్సల్టెంట్లు చెప్పినట్టుగానే చంద్రబాబు చేయాల్సి వస్తుంది. దీనివల్ల సోషల్ మీడియాలో విష ప్రచారం జరుగుతోంది.సూపర్ సిక్స్ పథకాలలో ఇంకా రెండు అమలు కావడం లేదు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు.. ఇది సాధికాకపోతే నెలకు 3000 నిరుద్యోగ భృతి.. ప్రతినెల మహిళకు 1500 రూపాయల చొప్పున ఆడబిడ్డ నిధి ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కావడం లేదు. ఇక మిగతా పథకాలు తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం 2.. స్త్రీ శక్తి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి.కొంతమంది నేతలు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. దారుణంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అవినీతి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. పోలీస్ విధుల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారు. వారి వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది.. ఎమ్మెల్యేలు వ్యవహార శైలి మార్చుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా చంద్రబాబు రంగంలోకి దిగి హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే.. ప్రజాప్రతినిధులు ఎలా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇలా చేసి వైసిపి ప్రజల నుంచి ఎలాంటి ఫలితాన్ని ఎదుర్కొన్నదో అందరూ చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి అటువంటి పరిస్థితి రాకూడదంటే నేతలు జాగ్రత్తగా ఉండడం చాలా మంచిది

# మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు.

**వికారాబాద్: పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాడ్లాపూర్ రైతులకు మద్దతుగా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, పోలీసులు రంగాపూర్ చౌరస్తాలో అరెస్ట్ చేసారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇవ్వమని గ్రామ సర్పంచ్, రైతులు అమరణ నిరాహారదీక్షకు దిగారు. ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రైతులను పరామర్శించేందుకు వెళు తుండగా మహేష్ రెడ్డిని పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసారు. పోలీసుల తీరుపై అయన మండిపడ్డారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# వీకెండ్ షాకిచ్చిన గోల్డ్.. 2 రోజుల్లో 10 గ్రాములకు రూ.3వేల 440 పెరిగి ధర



ఒకపక్క శాంతి చర్చలు మరోపక్క దాడులు ఇరాన్ అమెరికా మధ్య కొనసాగుతున్న పరిస్థితి ఇది. దీంతో గ్లోబల్ బులియన్ మార్కెట్లు పూర్తిగా అస్తవ్యస్థంగా కొనసాగుతున్నాయి. గడచిన రెండు వారాలుగా భారీగా తగ్గిన బంగారం రేట్లు శుక్రవారం నుంచి రివర్స్ గేర్ తీసుకున్నాయి. దీంతో శుక్ర, శని వారాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర ఏకంగా రూ.3వేల 440 పెరుగుదలను నమోదు చేసింది. దీంతో వీకెండ్ ఇంకా రేట్లు తగ్గుతాయ్ షాపింగ్ చేద్దాం అనుకుంటున్న తెలుగు ఫ్యామిలీస్ షాకయ్యాయి. ఈ క్రమంలో ఆభరణాలు కొనాలనుకుంటున్న తెలుగు ప్రజలు ముందుగా తమ నగరాల్లోని మారిన రేట్లను పరిశీలించటం బెటర్. జూన్ 13న బంగారం రేట్లు పెరిగాయి. జూన్ 12 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.50 పెరిగింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 908గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 665గా కొనసాగుతోంది. శనివారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూన్ 13, 2026న దేశవ్యాప్తంగా మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.2లక్షల 70వేలుగా ఉంది. అంటే గ్రాము దాదాపు రూ.270 దగ్గర ఉంది.

# మినిస్టర్ విజయశాంతి... ఒక బెర్త్ ఆమెకు కంఫర్మ్ ?



సినీ రంగంలో దశాబ్దాల పాటు టాప్ హీరోయిన్ గా రాణించిన విజయశాంతి రాజకీయాల్లోనూ తనదైన హవా చాటుకుంటూ వచ్చారు. మెదక్ నుంచి ఒకసారి ఎంపీగా గెలిచిన ఆమె తాజాగా కాంగ్రెస్ లో ఎమ్మెల్సీ అయ్యారు. అనూహ్యంగా కేంద్ర కాంగ్రెస్ పెద్దల సిఫార్సులతో ఎమ్మెల్సీగా చోటు సంపాదించిన విజయశాంతి ఇపుడు మంత్రి పదవి కోసం పావులు కదుపుతున్నారని అంటున్నారు. కాంగ్రెస్ లో చేరిన ఆమె ఎమ్మెల్సీ అయినా మౌన ముద్రలోనే ఉంటున్నారు. శాసనమండలిలో ఆ మధ్య ప్రభుత్వం మీద పరోక్ష విమర్శలు చేసిన విజయశాంతి తనలోని అసంతృప్తిని ఆ విధంగా చాటారు అని గుర్తు చేస్తున్నారు. తమ స్థాయికి తగినట్లుగా మంత్రి పదవి రావడం లేదన్న ఆవేదన ఆమెలో ఉంది అని అంటున్నారు.

**దూరంగానే ఉంటూ :**

కాంగ్రెస్ లో చేరిన ఆమె ఎంపీగా పోటీ చేయాలనుకున్నారు. కానీ 2024లో సీటు దక్కలేదు, ఇక ఎమ్మెల్సీగా ఆమె పేరుని హైకమాండ్ దగ్గరుండి మరీ పెట్టించింది అని చెప్పుకున్నారు. దాంతో కేంద్ర నాయకులతోనే టచ్ లో ఉంటూ వస్తున్న విజయశాంతి తెలంగాణా కాంగ్రెస్ రాజకీయాల్లో అంటీ ముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు ఆమె దూరంగానే ఉంటున్నారు అని ప్రచారం సాగుతోంది. మరో వైపు చూస్తే పార్టీ తన సేవలను పూర్తి స్థాయిలో వాడుకోవడం లేదన్న బాధ కూడా ఆమెకు ఉందని అంటున్నారు. ఇక మంత్రి పదవి కోసం విజయశాంతి ఎదురుచూస్తున్నారు అన్న చర్చ కూడా సాగుతోంది.

**త్వరలోనే విస్తరణ :**

ఇదిలాఉంటే తెలంగాణాలో కాంగ్రెస్ మంత్రి వర్గ విస్తరణ త్వరలో ఉంటుందని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. కేబినెట్ లో కొన్ని ఖాళీలు ఉన్నాయి. అదే సమయంలో పనిచేయని వారిని తీసి పక్కన పెట్టాలని కూడా కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారని అంటున్నారు. అలా చూసుకుంటే కనీసంగా అరడజన్ నుంచి గరిష్టంగా ఎనిమిది దాకా మంత్రి పదవులు కొత్తగా తీసుకునే చాన్స్ ఉందని ప్రచారం సాగుతోంది. సామాజిక ప్రాంతీయ సమతూల్యతతో పాటు గ్లామర్ ఉన్న వారికి పార్టీ వాయిస్ ని ప్రభుత్వం అజెండాను జనంలోకి తీసుకుని వెళ్లే వారికే ప్రాధాన్యత అని కూడా చెబుతున్నారు. దాంతో సినీ రంగంలో అగ్రశ్రేణి తారగా వెలుగొంది రాములమ్మగా జనాల చేత పిలిపించుకుంటున్న విజయశాంతి తన ఇమేజ్ తో మంత్రి కావాలని చూస్తున్నారు అని అంటున్నారు.

**హస్తినకు పయనమా :**

ఈ క్రమంలో విజయశాంతి హస్తిన బాట పడతారు అని కూడా ప్రచారం సాగుతోంది. ఆమె తొందరలోనే ఢిల్లీ వెళ్ళి హైకమాండ్ పెద్దలతోనే భేటీ అవుతారు అని అంటున్నారు. తనకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వాలన్నది ఆమె వివరించడమే కాకుండా ఇస్తే కనుక తాను ఏమి చేస్తాను అన్నది కూడా తెలియచేస్తారని కూడా అంటున్నారు. నేరుగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతోనే ఆమె భేటీ అవుతారు అని కూడా ప్రచారం సాగుతోంది. వరసగా మరోసారి కాంగ్రెస్ గెలవాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. దాంతో నోరున్న పేరున్న నాయకులకు పదవులు ఇవ్వాలని అనుకుంటున్నారు. సరిగ్గా ఇదే అవకాశంగా విజయశాంతి ఢిల్లీ ఫ్లైట్ ఎక్కనున్నారు అని అంటున్నారు.

**అన్ని అర్హతలు సరి చూసుకునే :**

ఇక రాములమ్మ తనకు ఉన్న అన్ని అర్హతలు సరిచూసుకునే మంత్రి పదవిని కోరుకుంటున్నారు అని అంటున్నారు. జనంలో ఇమేజ్ ఉందని అలాగే బీసీ నేతగా గుర్తింపు ఉందని తెలంగాణా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రికార్డు ఉందని ఆమె అనుచరులు గుర్తు చేస్తున్నారు. మంత్రిగా ఆమెకు స్థానం కల్పిస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే మేలు చేకూరుస్తుందని కూడా చెబుతున్న వారూ ఉన్నారు. మొత్తానికి విజయ శాంతి మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్తారు అన్న ప్రచారం మాత్రం గట్టిగా సాగుతోంది. ఇక రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో దూకుడుగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. కీలకమైన మార్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో విజయశాంతికి మంత్రి పదవి దక్కినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం ఏ విధంగా మారుతుందో.

# ‘అమ్మ’ మరణంపై సామాజిక కార్యకర్త ప్రశ్నలు.. తమిళ రాజకీయాల్లో కొత్త చర్చ



కోట్లాది మంది తమిళులకు ‘అమ్మ’గా దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితతో ఉన్న భావోద్వేగ బంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆమె తుదిశ్వాస విడిచి దగ్గర దగ్గర తొమ్మిదిన్నరేళ్లు అవుతోంది. ఈ డిసెంబరుకు పదేళ్లు పూర్తవుతాయి. ఇప్పటికి ఆమె మరణం మీద ఉన్న సందేహాలకు సమాధానాలు పూర్తిగా రాని పరిస్థితి. గతంలో నియమించిన అరుముగస్వామి కమిషన్ ఇచ్చిన రిపోర్టు కొత్త గందరగోళానికి కారణమైందే తప్పించి.. క్లారిటీ ఇచ్చింది లేదు. సదరు కమిషన్ రిపోర్టులో పేర్కొన్న అంశాల మీద ఇంతకాలం జరిగిందేమీ లేదు. కమిషన్ లేవనెత్తిన సందేహాలు.. అనుమానాలకు తదుపరి చర్యలు ఏమిటి? అంటే.. న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నట్లుగా చెప్పటమే తప్పించి.. చేసిందేమీ లేదు. ఇదిలా ఉండగా.. గత నెలలో సామాజిక కార్యకర్తగా.. సమాచార హక్కు చట్టం ద్వారా పలు అంశాలపై ప్రశ్నలు అడగటం ద్వారా సామాన్యులకు పలు అంశాల మీద అవగాహన కల్పించే అలవాటున్న రామక్రిష్ణన్.. దివంగత మాజీ ముఖ్యమంత్రి మరణం తర్వాత ఏర్పాటు చేసిన దర్యాప్తు.. ఆ తర్వాత ప్రభుత్వ స్థాయిలో జరుగుతున్న పరిణామాలు బయటకు వచ్చేలా మూడు ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానాలు తాజాగా వెలుగు చూశాయి. దీంతో.. అమ్మ మరణం తమిళనాడులో మరోసారి చర్చకు తెర తీసినట్లైంది. ఇంతకూ సామాజిక కార్యకర్త రామక్రిష్ణన్ అడిగిన మూడు ప్రశ్నలు.. వాటికి ప్రభుత్వం నుంచి వచ్చిన సమాధానాలు చూస్తే.. మదిలో కొత్త ప్రశ్నలు మెదలటం ఖాయం.

1. జస్టిస్ ఎ అరుముగస్వామి కమిషన్ సమర్పించిన తుది దర్యాప్తు రిపోర్టులో ప్రస్తావించిన సిఫార్సులు.. నేరారోపణలపై తమిళనాడు ప్రభుత్వం తీసుకున్నతదుపరి చర్యలేంటి?

2. ప్రస్తుత స్థితి ఏంటి? కమిషన్ రిపోర్టు ఇచ్చి సుదీర్ఘకాలం గడుస్తున్నప్పటికి.. ఈ విచారణ ప్రక్రియకు సంబంధించిన ఫైళ్లు ప్రస్తుతం ఏ ప్రభుత్వ అధికారి వద్ద పెండింగ్ లో ఉన్నాయి?

3. జయలలితకు వైద్య చికిత్సను అందించిన అపోలో ఆసుపత్రిలో 75 రోజుల పాటు చికిత్స చేసినందుకు అయిన ఖర్చు ఎంత? ఆసుపత్రి బిల్లును ప్రభుత్వం చెల్లించిందా? మరేదైనా సంస్థ చెల్లించిందా? దానికి సంబంధించిన అధికారిక రికార్డుల వివరాలు ఇవ్వగలరు.

ఆసక్తికరమైన అంశం ఏమంటే.. స.హ. చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజులకే సమాధానాలు తెలుపుతూ వివరాలను అందించారు. ఇందులో కీలక అంశం ఏమంటే.. కమిషన్ రిపోర్టు ఆధారంగా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదని స్పష్టం చేయటంతో పాటు.. ఆసుపత్రిలో అమ్మకు చేసిన వైద్యానికి వేసిన బిల్లు రూ.6.85 కోట్లుగా వెల్లడైంది. ఆసుపత్రి బిల్లును అన్నాడీఎంకే పార్టీ చెల్లింపులు జరిపిందని.. మొత్తం రూ.6.85 కోట్ల బిల్లుకు పార్టీ రూ.6 కోట్లను పార్టీ నిధుల నుంచి చెల్లించినట్లుగా వెల్లడైంది.

ఈ వివరాలు బయటకు రావటంతో.. అరుముగస్వామి రిపోర్టు జయలలిత మరణం వెనుక ఉన్న అనుమానాలు.. కొందరి వ్యక్తుల తప్పులను ఎత్తి చూపిన వైనం తెలిసిందే. తాజాగా స.హ. చట్టం ద్వారా వెల్లడైన వివరాలతో.. కమిషన్ లేవనెత్తిన సందేహాలకు తగిన సమాధానాలు ఇప్పటివరకు వెతకలేదన్న విషయాన్ని స్పష్టం చేసినట్లైంది. దీంతో.. డీఎంకే ప్రభుత్వం అమ్మ మరణాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవటమే తప్పించి.. ఆమె మరణంపై ఎలాంటి సీరియస్ నెస్ లేదన్న విషయం తాజాగా స్పష్టమైందని చెప్పాలి.

అమ్మకు అపోలో ఆసుపత్రిలో అందించిన వైద్యం.. దానికి వేసిన బిల్లుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం బిల్లు రూ.6,85,69,584 వెల్లడైంది.అందులో జయలలితతో పాటు.. ఆమె సహాయకులు.. విధుల్లో ఉన్న సిబ్బంది.. ఇతర ప్రముఖుల భోజన వసతుల కోసం రూ.1.17 కోట్లు ఖర్చు అయినట్లుగా వెల్లడైంది. అంతేకాదు.. లండన్ తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అంతర్జాతీయ వైద్య నిపుణుల ఫీజులు.. మందులు.. క్రిటికల్ కేర్ సేవల కోసం రూ.1.92 కోట్లు ఖర్చు అయినట్లుగా వెల్లడైంది. జయలలిత ఉన్న వార్డుతో పాటు సెక్యూరిటీ కారణాలతో ఆసుపత్రిలోని రెండో ఫ్లోర్ ను ఖాళీ చేయించి.. మొత్తం జయలలిత కోసం కేటాయించినందుకుగదుల అద్దె కింద రూ.24 లక్షల బిల్లు వేసినట్లుగా తేలింది. మొత్తంగా ఆసుపత్రి బిల్లులో రూ.6 కోట్లను అన్నాడీఎంకే పార్టీ నుంచి చెల్లింపులు జరపగా.. మిగిలిన రూ.44.56 లక్షలు పెండింగ్ లో ఉన్నట్లుగా వెల్లడైంది. అరుముగస్వామి కమిషన్ తన నివేదికను సమర్పించి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా.. కమిషన్ రిపోర్టు సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం.. అవన్నీ పెండింగ్ లో ఉండటంతో తాజాగా విజయ్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక ఫోకస్ చేసే వీలుందని చెబుతున్నారు. జయలలిత మరణంపై నెలకొన్న సందేహాలను కమిషన్ లేవనెత్తిన వేళ.. ఆ అంశంపై స్టాలిన్ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించలేదన్న విమర్శలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇలాంటి వేళ.. విజయ్ ప్రభుత్వం తీసుకునే చర్యలు ఏమిటన్న విషయం తాజాగా వెల్లడైన వివరాలతో మరోసారి హాట్ టాపిక్ గా మారింది. మరి.. విజయ్ ప్రభుత్వం ఎలా రియాక్టు అవుతుందన్నది చూడాలి.

# కోర్టులో గెలిచి నిబంధనలతో ఓడిన మీనాక్షి నటరాజన్.. పరువు నష్టం కేసు తిరస్కరణ



రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి అడ్డుగా నిలిచిన కేసులో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ కి ఊరట దక్కింది. అయితే ఇప్పటికే జరగాల్సిన నష్టం జరగడంతో మీనాక్షి పరిస్థితిపై సానుభూతి వ్యక్తమవుతోంది. నారాయణపేటకు చెందిన మాజీ కాంగ్రెస్ నాయకుడు తనను లైంగికంగా వేధిస్తున్నారని, ఆయనపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తోపాటు మరికొందరిపై ఓ మహిళ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు పెండింగులో ఉన్న విషయాన్ని తెలియజేయకుండా రాజ్యసభ నామినేషన్ వేయడంతో మీనాక్షి నటరాజన్ నామినేషన్ ను మధ్యప్రదేశ్ లో తిరస్కరించారు. దీనిపై మీనాక్షి ఓ వైపు న్యాయపోరాటం చేస్తుండగా, మీనాక్షిపై నాంపల్లి కోర్టులో పెండింగులో ఉన్న కేసుపై శుక్రవారం తీర్పు వెలువడింది.

శివకుమార్ రెడ్డి లైంగిక వేధింపులపై మీనాక్షిపై ఆరోపణలు చేస్తూ మహిళ వేసిన పిటిషన్ ను విచారించేందుకు నాంపల్లి అదనపు మెట్రోపాలిటిన్ కేసు నిరాకరించింది. ఈ కేసును కాగ్నిజెన్స్ గా తీసుకుని సమన్లు ఇచ్చే పరిధి ఈ న్యాయస్థానానికి లేదని న్యాయాధికారి వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ నాయకుల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ గతంలో కోర్టు జారీ చేసిన సమన్లపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసుకు సంబంధించిన పూర్తి విషయాలను తెలుసుకోకుండానే తమ నాయకులకు సమన్లు ఇచ్చారని న్యాయవాది వాదించారు.

మహిళ దాఖలు చేసిన ఫిర్యాదు స్వభావ రీత్యా ప్రజాప్రతినిధుల కోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని నాంపల్లి కోర్టు అభిప్రాయపడింది. దీంతో మీనాక్షి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన పిటిషన్ ను కోర్టు అసలు విచారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. మేజిస్ట్రేట్ కోర్టు ఇంకా పరిగణనలోకి తీసుకోని ఓ ప్రైవేటు కేసు మీనాక్షి రాజ్యసభ సభ్యత్వానికి అడ్డుపడటం తీవ్ర సంచలనంగా మారింది. నాంపల్లి కోర్టు ఇచ్చిన ఆదేశాలతో మీనాక్షి నటరాజన్ నైతికంగా గెలిచారని అంటున్నారు. అయితే అప్పటికే ఆమెకు జరగాల్సిన నష్టం జరిగిపోయిందని అంటున్నారు.

నాంపల్లి కోర్టు నిర్ణయంతో మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు కారణమైన కేసు ఇప్పుడు ఆమెపై లేనట్లే అంటున్నారు. ఇదే వారం రోజులు ముందు జరిగి ఉంటే మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు గురయ్యేది కాదని అంటున్నారు. మీనాక్షి నటరాజన్ ను దురదృష్టం వెంటాడినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు మీనాక్షి నటరాజన్ పై కేసు పెట్టిన మహిళ, ఆమె రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను ఎంతో బాధ కలిగించిందని వ్యాఖ్యానించారు. కాగా, ఈ విషయంలో తాను న్యాయపోరాటం కొనసాగిస్తానని, నాంపల్లి కోర్టు సూచనల ప్రకారం సోమవారం ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్ వేస్తానని స్పష్టం చేశారు.

# టాటాకు భారీ షాక్: కాలుష్య వివాదంలో హోసూర్ ఐఫోన్ తయారీ ప్లాంట్.. మూతపడనుందా?


దేశంలో ఆపిల్ ఐఫోన్ల ప్రొడక్షన్‌ను భారీగా పెంచి, చైనాకు గట్టి పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్‌కు ఊహించని కష్టాలు వచ్చిపడ్డాయి. తమిళనాడులోని హోసూర్‌లో ఉన్న టాటా ఐఫోన్ కాంపోనెంట్స్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలు సమీపంలోని వ్యవసాయ భూములు, బావులను కలుషితం చేస్తున్నాయని తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ నిబంధనల ఉల్లంఘనపై సరైన వివరణ ఇవ్వకపోతే.. ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, యూనిట్‌ను పూర్తిగా మూసివేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ టాటా సంస్థకు వార్నింగ్ నోటీసు జారీ చేసింది.



ఈ వివాదం వెనుక కొన్ని నెలలుగా స్థానిక రైతులు పడుతున్న బాధలు ఉన్నాయి. ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల తమ పంట పొలాలు, ఓపెన్ వెల్స్ పాడైపోతున్నాయని రైతులు చేసిన ఫిర్యాదులతో కాలుష్య నియంత్రణ మండలి డిసెంబర్ 2025 నుంచి మే 2026 మధ్య 5 సార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. మే 25 నాటి రెగ్యులేటరీ నోటీసు ప్రకారం.. టాటా సంస్థ తన ఫ్యాక్టరీ లోపల ఉన్న వర్షపు నీటి నిల్వ చెరువులోకి వేస్ట్ వాటర్ వదిలిందని, అది కాస్తా ఓవర్‌ఫ్లో అయి పక్కనే ఉన్న వ్యవసాయ భూముల్లోని భూగర్భ జలాలను కలుషితం చేసిందని అధికారులు తేల్చారు. గత ఏడాది డిసెంబర్ 23న ఇచ్చిన ఆదేశాలపై టాటా సరైన చర్యలు తీసుకోలేదని కూడా నోటీసులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలను టాటా ఎలక్ట్రానిక్స్ తీవ్రంగా ఖండించింది. తాము ఒక గుర్తింపు పొందిన స్వతంత్ర లాబొరేటరీ ద్వారా పర్యావరణ అనాలసిస్ చేయించామని.. ఆ రిపోర్ట్ ప్రకారం తాము అన్ని రకాల ప్రభుత్వ పొల్యూషన్ కంట్రోల్ రూల్స్ పక్కాగా పాటిస్తున్నట్లు తేలిందని స్పష్టం చేసింది. స్థానిక కమ్యూనిటీల సేఫ్టీ, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులకు తాము కట్టుబడి ఉన్నామని.. కాలుష్య నియంత్రణ అధికారులకు ఇప్పటికే తగిన సమాధానం ఇచ్చామని టాటా పేర్కొంది. అయితే తమ సప్లయర్స్ వ్యర్థాల నిర్వహణపై కఠిన నిబంధనలు అమలు చేసే ఆపిల్ సంస్థ గానీ, తమిళనాడు ప్రభుత్వం గానీ దీనిపై ఇంకా అధికారికంగా స్పందించలేదు.దదేశంలో పరిశ్రమలు ఇలాంటి పర్యావరణ క్రమశిక్షణా చర్యలను ఎదుర్కోవడం కొత్తేమీ కాదు. గతంలో 2024లో మెర్సిడెస్ బెంజ్ కూడా పర్యావరణ చట్టాల లోపాల వల్ల తన ఫ్యాక్టరీలో మార్పులు చేసుకోవాల్సి వచ్చింది. గత ఐదేళ్లలో పర్యావరణ ప్రమాణాలు పాటించని సుమారు 3,600 పరిశ్రమలను కాలుష్య నియంత్రణ విభాగాలు మూసివేసినట్లు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో తెలిపింది. అయితే యాపిల్ సరఫరా గొలుసులో సమస్యలు ఎదురవడం ఇది మొదటిసారి కాదు. గతంలో హోసూర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం, ఫాక్స్‌కాన్ సంస్థలో వివాదాలు రేగినప్పటికీ, ఐఫోన్ తయారీలో భారత్ వేగంగా దూసుకుపోతోంది.

ఈ కాలుష్య వివాదం ఆపిల్ గ్లోబల్ ప్లాన్స్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే నాలుగేళ్ల క్రితం ప్రపంచవ్యాప్తంగా కేవలం 6 శాతంగా ఉన్న భారత ఐఫోన్ల ఉత్పత్తి, 2026 నాటికి ఏకంగా 26 శాతానికి చేరుకుంటుందని రీసెర్చ్ ఫర్మ్ కౌంటర్ పాయింట్ అంచనా వేసింది. చైనా బయట ఆపిల్‌కు ఫాక్స్‌కాన్ తర్వాత టాటానే అతిపెద్ద సప్లయర్‌గా ఉంది. ఇలాంటి కీలక తరుణంలో హోసూర్ ప్లాంట్‌కు మూసివేత నోటీసులు రావడం ఆపిల్, టాటా గ్రూప్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఈ సమస్యను టాటా ఎంత త్వరగా పరిష్కరిస్తుందనే దానిపైనే ఐఫోన్ల భవిష్యత్ తయారీ ఆధారపడి ఉంది.

# రఘురామ్ రాజన్ 2013 ఫార్ములా రిపీట్ చేస్తున్న RBI.. రూపాయి నిలదొక్కుకుంటుందా?




ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో వడ్డీ రేట్లను పెంచి దేశీయ వృద్ధిని దెబ్బతీయడం కంటే.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ఉత్తమ మార్గమని రిజర్వ్ బ్యాంక్ భావించింది. జూన్ 2026 పాలసీ మీటింగ్‌లో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తీసుకున్న నిర్ణయాలు.. గతంలో 2013 నాటి ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్ అనుసరించిన సక్సెస్ ఫుల్ వ్యూహాన్ని గుర్తుచేస్తున్నాయి. వడ్డీ రేట్లు పెంచకుండానే దేశంలోకి డాలర్ల వరద పారించడం ద్వారా ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడమే ఈ సరికొత్త ప్లాన్.

**అసలేంటి ఈ ఎఫ్‌సీఎన్ఆర్(బి) మ్యాజిక్?**

ఈ వ్యూహంలో అత్యంత కీలకమైనది ఎఫ్‌సీఎన్ఆర్(బి) ఢఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్)రి డిపాజిట్లపై రాయితీలను మళ్లీ తీసుకురావడం. ఇది ఎన్ఆర్ఐలు భారతీయ బ్యాంకుల్లో డాలర్లు, యూరోలు, పౌండ్ల రూపంలో దాచుకునే ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్. దీనివల్ల ఎన్ఆర్ఐలకు రూపాయి విలువ తగ్గిపోతుందనే భయం ఉండదు, పైగా వడ్డీపై భారత్‌లో ఎలాంటి పన్ను ఉండదు. సాధారణంగా ఈ విదేశీ కరెన్సీని బ్యాంకులు రూపాయిల్లోకి మార్చి లోన్లు ఇస్తాయి. కానీ ఎక్స్ఛేంజ్ రేట్ రిస్క్ మారినప్పుడు నష్టపోకుండా ఉండేందుకు చేసే 'హెడ్జింగ్' బ్యాంకులకు భారీ ఖర్చుతో కూడుకున్నది. ఇక్కడే ఆర్‌బీఐ రంగంలోకి దిగింది. సెప్టెంబర్ 30, 2026 వరకు వచ్చే కొత్త 3-5 ఏళ్ల ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లపై అయ్యే పూర్తి హెడ్జింగ్ ఖర్చును ఆర్‌బీఐ భరిస్తుందని ప్రకటించింది. దీనివల్ల బ్యాంకులు ఎన్ఆర్ఐలకు అమెరికా బాండ్ల కంటే ఎక్కువగా 5.5% నుంచి 6% వరకు బంపర్ వడ్డీ రేట్లను ఆఫర్ చేయగలవు. 2013లో రఘురామ్ రాజన్ ఇలాంటి స్కీమ్ తీసుకురావటం ద్వారానే ఏకంగా 26 బిలియన్ డాలర్లను దేశంలోకి తీసుకువచ్చారు. ఈసారి ఏకంగా 35 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.3లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు వస్తాయని అంచనా.

**బాండ్ మార్కెట్‌కు బూస్ట్..**

రెండో కీలక అడుగు విదేశీ రుణాల (- ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్) సరళీకరణ. భారత ప్రభుత్వ రంగ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్ నుంచి తక్కువ వడ్డీకి డాలర్ రుణాలు తీసుకునేందుకు సెప్టెంబర్ 2026 వరకు ఆర్‌బీఐ రాయితీలతో కూడిన ఫారెక్స్ స్వాప్ సౌకర్యాన్ని కల్పించింది. దీనితో పాటు విదేశీ పెట్టుబడిదారులు భారత ప్రభుత్వ బాండ్లలో సులభంగా పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా నిబంధనలను సడలించింది. దీనికి మద్దతుగా కేంద్ర ప్రభుత్వం కూడా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు గవర్నమెంట్ సెక్యూరిటీలపై క్యాపిటల్ గెయిన్స్, విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌లను పూర్తిగా రద్దు చేసింది. దీనివల్ల బ్లూమ్‌బర్గ్ గ్లోబల్ బాండ్ ఇండెక్స్‌లో భారత్‌కు చోటు దక్కే అవకాశం పెరిగింది.

**రూపాయి కోసం కాదు..**

ఈ భారీ చర్యల ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి దాదాపు 55 నుంచి 65 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చే ఛాన్స్ ఉంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం దేశీయ డిమాండ్ వల్ల వచ్చింది కాదు.. కేవలం ముడిచమురు సరఫరా లోపాల వల్లే ఏర్పడింది. కాబట్టి వడ్డీ రేట్లు పెంచితే పెట్టుబడులు ఆగిపోతాయి. అందుకే ఆర్‌బీఐ విదేశీ డాలర్లను ఆకర్షించి విదేశీ మారక నిల్వలను పెంచుకుంటూ, రూపాయిని స్థిరపరుస్తోంది. సింపుల్ గా చెప్పాలంటే ఆర్‌బీఐ కేవలం రూపాయి కోసమే కాకుండా.. దేశ ఆర్థిక వృద్ధికి ఎలాంటి డోకా లేకుండా చేస్తూ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది.

# రిలయన్స్ టెలికాం మాజీ ఎగ్జిక్యూటివ్‌లను ఈడీ షాక్: గౌతమ్ దోషి, సతీష్ సేథ్ అరెస్ట్




ఇండస్ట్రియలిస్ట్ అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ సంస్థల్లో జరిగిన మనీ లాండరింగ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(జుణ) సంచలన నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ టెలికామ్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, అనిల్ అంబానీకి అత్యంత సన్నిహితులైన గౌతమ్ దోషి, సతీష్ సేథ్‌లను ఈడీ అధికారులు ముంబైలో అరెస్ట్ చేశారు. న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలోని స్పెషల్ టీమ్ ఈ మనీ లాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తోంది.

అరెస్ట్ అనంతరం గౌతమ్ దోషిని ఢిల్లీకి తరలించి, ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టులో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు సతీష్ సేథ్ అరెస్ట్ అయిన వెంటనే అనారోగ్య కారణాలతో ముంబైలోని జేజే హాస్పిటల్‌లో చేరారు. వైద్యుల అనుమతి లేకపోవడంతో ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. ముంబై కోర్టు సేథ్‌కు 2 రోజుల ఈడీ కస్టడీని మంజూరు చేస్తూ.. జూన్ 14న ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టాలని ట్రాన్సిట్ రిమాండ్ జారీ చేసింది.

గతంలో అనిల్ అంబానీ కోర్ టీమ్‌లో అమితాబ్ జున్‌జున్‌వాలాతో పాటు ఈ ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. జున్‌జున్‌వాలా ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. గౌతమ్ దోషి గతంలో 2011 నాటి 2+ స్పెక్ట్రమ్ కేసులో సీబీఐ ద్వారా అరెస్ట్ అయి 7 నెలల పాటు జైల్లోనే ఉన్న సంగతి తెలిసిందే.

ఈ ఏడాది మార్చిలో ాదీ× నేతృత్వంలోని 11 బ్యాంకుల కన్సార్టియం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా.. రూ.100 కోట్లకు పైగా బ్యాంక్ మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై వీరిద్దరిపై సీబీఐ కొత్త అవినీతి కేసు నమోదు చేసింది. ఈ ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లకు ప్రస్తుతం రిలయన్స్ గ్రూప్‌తో ఎలాంటి సంబంధం లేదని అనిల్ అంబానీ ప్రతినిధి స్పష్టం చేశారు. ప్రస్తుతం వారు సొంతంగా రియల్ ఎస్టేట్, టాక్స్ అడ్వైజరీ బిజినెస్‌లలో కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఏదేమైనా ఈడీ జరిపిన ఈ అరెస్టులు ఇప్పుడు కార్పొరేట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## 130 కిలోమీటర్లు కారు నడిపిన సీఎం విజయ్ : సీఎం హోదాలో దేశంలో ఫస్ట్



తమిళనాడు సీఎం విజయ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యారు. ఓ రాష్ట్రానికి సీఎం హోదాలో ఉండి సొంతంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లటం అనేది చాలా చాలా అరుదు. సీఎం భద్రత కఠినంగా ఉంటుంది. సీఎం దగ్గర నలుగురు, ఐదుగురు అత్యంత నిపుణులైన కారు డ్రైవర్లు ఉంటారు. సీఎం ఎక్కడికి వెళ్లాలన్నా వాళ్లే చూసుకుంటారు. అలాంటి నిబంధనలు అన్నీ పక్కన పెట్టి.. తమిళనాడు సీఎం విజయ్ సొంతంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. అది ఏదో 10, 20 కిలోమీటర్లు కాదు.. ఏకంగా 130 కిలోమీటర్లు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఇదే హాట్ టాపిక్ అయ్యింది.

2026, జూన్ 13వ తేదీ ఉదయం సీఎం విజయ్ కర్నాటక రాష్ట్రం ఉడిపి జిల్లాలోని కొల్లూరు ముకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి బంగారం కత్తి బహూకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం దర్శనం అనంతనం.. ముకాంబికా దేవి ఆలయం నుంచి తిరిగి బయలుదేరారు. ఆలయం నుంచి మంగుళూరు ఎయిర్ పోర్టుకు 130 కిలోమీటర్లు.

ఆలయం నుంచి బయలకు వచ్చిన సీఎం విజయ్.. భద్రతా నిబంధనలు పక్కన పెట్టి.. తానే స్వయంగా కారు డ్రైవ్ చేస్తానని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బంది ఎంత నచ్చచెప్పినా వినలేదు. సీఎం విజయ్ స్వయంగానే తానే డ్రైవ్ చేయటం మొదలుపెట్టారు.

కొల్లూరు ముకాంబికా దేవి ఆలయం నుంచి మంగళూరు ఎయిర్ పోర్టు వరకు 130 కిలోమీటర్లు తానే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చారు. ముందూ వెనకా సెక్యూరిటీ సిబ్బంది, కాన్వాయ్ కార్లు వెళ్లాయి. టోల్ గేట్ దగ్గర సీఎం విజయ్ డ్రైవింగ్ వీడియోలు బయటకు రావటంతో ఈ విషయం బయటకు వచ్చింది.

సీఎం విజయ్ డ్రైవ్ చేసిన కారు టయాటా ల్యాండ్ క్రూయిజర్ 300 మోడల్. సీఎం విజయ్ కు కార్లు అంటే పిచ్చి. డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. విజయ్ ఇంట్లో 12 రకాల కార్లు ఉన్నాయి. సీఎం కాకముందే ఎక్కువగా తానే డ్రైవ్ చేస్తూ ఉండేవారు. కొత్త కారు కొనుగోలు చేసినప్పుడు కారు రివ్యూలు కూడా ఇస్తుంటారు.

సీఎం అయిన తర్వాత డ్రైవింగ్ పక్కన సీట్లోనో.. వెనక సీట్లోనో కూర్చోవటం ఇబ్బందిగా ఉన్నట్లు ఉంది. డ్రైవింగ్ మక్కువ ఏ మాత్రం తగ్గని విజయ్.. కొల్లూరు ముకాంబికా దేవి ఆలయం నుంచి మంగళూరు ఎయిర్ పోర్టు వరకు నేషనల్ హైవేపై.. తానే స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్లారు.

చెన్నై సిటీలో ఉన్నప్పుడు.. జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు ఎటూ సాధ్యం కాదు.. ఇలాంటి టైంలో అయినా తన కోరికను తీర్చుకున్నారు అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. ఏదిఏమైనా సీఎం అయినంత మాత్రాన ఇష్టమైన వాటిని ఎలా వదులుకోగలరు... అందులోనూ హీరో కదా.

## EPFO బిగ్ అప్‌డేట్: ఆధార్ లింక్డ్ ఓటీపీతో ఆ పని పూర్తి చేయకపోతే పెన్షన్, ఇన్సూరెన్స్ కష్టమే





దేశంలో ఫార్మల్ ఉద్యోగాల మార్కెట్ ఓ రేంజ్‌లో దూసుకుపోతోంది. ఈపీఎఫ్ సంస్థ తాజా లెక్కలు దేశంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలకు అద్దం పడుతున్నాయి. గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే ఈసారి ఏకంగా 7.86 శాతం వృద్ధితో.. కొత్తగా 19.29 లక్షల మంది నెట్ మెంబర్లు ఈపీఎఫ్ఓ నెట్‌వర్క్‌లోకి చేరారు. ఇందులో అత్యంత క్రేజీ విషయం ఏంటంటే.. మొదటిసారి ఉద్యోగాల్లో చేరిన 18-25 ఏళ్ల లోపు యువత శాతమే ఏకంగా 59.14 శాతంగా ఉండటం. అంటే దేశంలో యువతకు పెద్ద ఎత్తున ఆర్గనైజ్డ్ సెక్టార్ లో అవకాశాలు దక్కుతున్నాయని స్పష్టమవుతోంది. కేవలం కొత్త వాళ్లే కాదు, గతంలో ఉద్యోగం మానేసి తాత్కాలికంగా బయటకు వెళ్లి, మళ్లీ తిరిగి ఈపీఎఫ్ఓలోకి రీ-ఎంట్రీ ఇచ్చిన వారి సంఖ్య కూడా 14.15 లక్షలుగా నమోదైంది. పీఎఫ్ ప్రయోజనాలపై కార్మికుల్లో పెరిగిన అవగాహనే కారణమని కేంద్ర కార్మిక శాఖ పేర్కొంది.

సభ్యుల సంఖ్య పెరగడమే కాదు.. ఈపీఎఫ్ఓ తన సేవలను కూడా అంతే స్పీడ్‌గా అప్‌గ్రేడ్ చేస్తోంది. గతంలో పేరు, పుట్టిన తేదీ, జెండర్, తలిదండ్రుల పేర్లు, జాయినింగ్ డేట్ వంటి పర్సనల్ డీటెయిల్స్ మార్చాలంటే పీఎఫ్ ఆఫీసుల చుట్టూ, పనిచేసిన ఓనర్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ తలనొప్పులన్నీ తీరిపోయాయి. యూనిఫైడ్ మెంబర్ పోర్టల్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో వీటిని అప్‌డేట్ చేసుకోవచ్చు. పోర్టల్‌లోకి లాగిన్ అయి.. "మీఖఝుస్త్రవ" సెక్షన్‌లోని "వీశీఽఱటఎ దీఘంఅఎ ణమ్ఘఅశ్రీం" ఆప్షన్ ద్వారా వివరాలను సరిదిద్దుకోవటమే కాకుండా, వాటి స్టేటస్‌ను కూడా ట్రాక్ చేసుకోవచ్చు.

**ఇ-నామినేషన్ చేయకపోతే ప్రమాదమే..**

ఇక అన్నింటికంటే ముఖ్యమైనది ఆన్‌లైన్ ఇ-నామినేషన్ ప్రక్రియ. పీఎఫ్ ఖాతాదారులు తమ కుటుంబ సభ్యులను నామినీగా చేర్చడాన్ని ఈపీఎఫ్ఓ మరింత సులభతరం చేసింది. పోర్టల్‌లోని "E-Nomination" సెక్షన్‌లోకి వెళ్లి నామినీ వివరాలు, పుట్టిన తేదీ, ఫోటోలను అప్‌లోడ్ చేయవచ్చు. అయితే ఇక్కడే ఒక ముఖ్యమైన రూల్ ఉంది. వివరాలన్నీ ఎంటర్ చేశాక.. ఆధార్ లింక్డ్ ఓటీపీ ద్వారా ఈ-సైన్ వెరిఫికేషన్ పూర్తి చేయడం తప్పనిసరి. ఈ ఫైనల్ స్టెప్ పూర్తి చేయకపోతే నామినేషన్ చెల్లుబాటు కాదు. ఒకవేళ దురదృష్టవశాత్తూ సభ్యుడు మరణిస్తే.. నామినేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల పీఎఫ్ బ్యాలెన్స్, పెన్షన్, ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు సకాలంలో అందక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాబట్టి ఖాతా యాక్టివేట్ చేసుకుని, ఆధార్ లింకేజ్ పూర్తి చేసి, రికార్డులను పక్కాగా ఉంచుకోవడం ఎంతో అవసరం.

# మూత్రం వస్తున్నా ఆపుకుంటున్నారా..?




నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగ పట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది పని, ప్రయాణం లేదా బిజీ షెడ్యూల్ కారణంగా ఎక్కువసేపు మూత్రాన్ని బిగ పట్టి ఉంచుకుంటారు.. ఈ అలవాటు అలా కొనసాగుతూనే ఉంటుంది.. అయితే.. ప్రజలు దీనిని సాధారణమని భావించి తరచుగా దీనిని విస్మరిస్తుంటారని.. కానీ, ఈ అలవాటు చాలా ప్రమాదమని, ఇది క్రమంగా అనారోగ్యం బారిన పడేలా చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూత్రవిసర్జన శరీరం నుండి అదనపు నీటిని, వివిధ విషాలను తొలగిస్తుంది. సమతుల్యతను కాపాడుకోవడానికి ఈ ప్రక్రియ చాలా అవసరం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీర సహజ ప్రక్రియలు దెబ్బతింటాయి. కొంతమంది దీనిని తేలికగా తీసుకుంటారు.. కానీ పదే పదే మూత్రం ఆపుకోవడం లేదా బిగపట్టుకోవడం వల్ల క్రమంగా ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. మీ శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరించడం మంచిది కాదు. సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం వల్ల శారీరక సాధారణ పనితీరు కొనసాగుతుంది. అందువల్ల, భవిష్యత్తులో సమస్యలను నివారించడానికి మూత్రం ఆపడం లేదా బిగపట్టడం వల్ల కలిగే హానిని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల శరీరంపై అనేక ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. మూత్రాశయంలో మూత్రం ఎక్కువసేపు నిలిచి ఉన్నప్పుడు, ఒత్తిడి పెరిగి, మూత్రాశయ కండరాలు ఒత్తిడికి గురవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఈ అలవాటు మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ల (యుటిఐ) ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువసేపు మూత్రాన్ని పట్టి ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కూడా పెరుగుతుంది. అదనంగా, పదే పదే మూత్ర విసర్జన చేయడం వల్ల మూత్రాశయం సరిగ్గా ఖాళీ అయ్యే సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. కొంతమందికి పొత్తి కడుపులో నొప్పి లేదా అసౌకర్యం కలగవచ్చు. ఈ అలవాటు ఎక్కువ కాలం కొనసాగితే, అది మూత్రపిండాల సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. అందువల్ల, ఎక్కువసేపు మూత్రాన్ని ఆపడం మంచిది కాదు.. మీ శరీరం సంకేతాలు ఇచ్చిన సమయానికి బాత్రూమ్‌కు వెళ్లడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు, వెంటనే బాత్రూమ్‌కి వెళ్లడం సాధ్యం కాని పరిస్థితి తలెత్తవచ్చు.. మీరు మీ మూత్రాన్ని కొంతసేపు ఆపవలసి రావచ్చు. అలాంటి సందర్భాలలో, మీ శరీరాన్ని విశ్రాంతి తీసుకోవడానికి, ఒత్తిడిని నివారించడానికి ప్రయత్నించండి. వీలైతే, నిశ్శబ్దంగా కూర్చోవడానికి ప్రయత్నించండి. ఎందుకంటే అధిక కదలిక మూత్రాశయంపై ఒత్తిడిని పెంచుతుంది.

# అల్లం, నిమ్మరసాన్ని తాగితే జరిగేది ఇదే



అల్లాన్ని వేల సంవత్సరాలుగా వంటల్లో, ఔషధాల్లో వినియోగిస్తున్నారు. ఇది యాంటీఆక్సిడెంట్, రక్త శుద్ధికి తోడ్పడుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల ప్రకారం, అల్లం షుగర్ నియంత్రణకు తోడ్పడుతుంది. నిమ్మరసంతో కలిపి అల్లం పానీయం తీసుకుంటే.. బరువు తగ్గించడంతో పాటు చర్మ సౌందర్యాన్ని పెంచి, అనేక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ప్రకృతి ప్రసాదించిన అత్యంత శక్తివంతమైన వనమూలికలలో అల్లం ఒకటి. భారతీయులు దాదాపు వేల సంవత్సరాలుగా అల్లాన్ని తమ సంప్రదాయ వైద్యంలో, వంటకాల్లో భాగంగా చేసుకున్నారు. అల్లంలో అనేక విలువైన పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అల్లంలో జింజెరోల్ అనే ముఖ్యమైన బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. దీంతోపాటు.. విటమిన్ సి, బి6, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్.. తోపాటు.. యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి శరీర ఆరోగ్యానికి ఎంతో కీలకం. అందుకే.. అల్లంతో అద్భుతమైన వైద్యం చేయవచ్చని చెబుతారు ఆయుర్వేద వైద్యులు.. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి.. వికారం, కీళ్ల నొప్పులు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అల్లం ఒక మంచి ఔషధంగా పనిచేయడమే కాకుండా, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గా కూడా ప్రసిద్ధి చెందింది. ఇది రక్త శుద్ధికి తోడ్పడుతుంది, రక్తనాళాలలో రక్తం గడ్డకట్టకుండా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా అల్లం వాడటం వలన కొన్ని వారాల్లో కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. అల్లం కడుపులో పూత ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. అలాగే, ఇది నోటి దుర్వాసనను సమర్థవంతంగా పోగొట్టి, నోటిలో చేరిన ప్రమాదకర బ్యాక్టీరియాను సంహరించి దంతాలను ఆరోగ్యముగా ఉండేలా చేస్తుంది. సిడ్నీ విశ్వవిద్యాలయం పరిశోధనల్లో అల్లం షుగర్ జబ్బు నియంత్రణ చేయగలిగిన శక్తివంతమైన ఔషధంగా వెల్లడైంది. అల్లం రక్తములోని చక్కెరలు కండరాలకు చేరే ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా మధుమేహ నిర్వహణలో సహాయపడుతుంది. అజీర్తితో బాధపడుతున్న వారికి అల్లం సేవించడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ఉదరంలో గ్యాస్ ఏర్పడినప్పుడు అల్లం దివ్యౌషధంలా పనిచేస్తుంది. దగ్గు, జలుబు, కఫం వంటి శ్వాసకోశ సమస్యలకు అల్లం అమృతంలా పనిచేస్తుందని అనడంలో సందేహం లేదు. ఇది జీర్ణక్రియ సాఫీగా జరిగేలా ఉపయోగపడుతుంది. నిమ్మకాయ, మంచి సువాసన మరియు రుచి కలిగిన సిట్రస్ జాతికి చెందిన పండు. దీనికి ఉన్న యాంటీ బాక్టీరియల్ గుణాలు, అధిక విటమిన్ సి కంటెంట్ ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. నిమ్మలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, అనేక అనారోగ్య సమస్యలకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. నిమ్మ వలన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. అజీర్ణం వలన ఏర్పడిన గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యలకు నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. నిమ్మ, అల్లం కలిపిన పానీయం రోజువారీ తీసుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఈ పానీయాన్ని తయారుచేయడానికి, అల్లాన్ని శుభ్రంగా కడిగి, దంచి ఒక గ్లాసు నీళ్ళల్లో మరిగించి, దానికి ఒక నిమ్మకాయ రసం కలిపి రోజూ తీసుకోవాలి. నిమ్మలో ఉన్న విటమిన్ సి కొవ్వును కరిగించి బరువు తగ్గించేందుకు సహాయపడుతుంది. అల్లం కూడా శరీరంలోని ఫ్యాట్‌ను కరిగిస్తుంది.

# బరువు తగ్గడం ఎందుకంత కష్టం?



బరువు తగ్గడం అనేది కేవలం “తక్కువ తినడం, ఎక్కువ కదలడం” అనే సరళమైన సమీకరణం కాదు. చాలా మంది పట్టుదలతో డైటింగ్ మొదలుపెట్టినా, కొద్ది రోజులకే ఆగిపోతుంటారు లేదా తగ్గిన బరువు మళ్ళీ పెరుగుతుంటారు. దీనికి కారణం క్రమశిక్షణ లేకపోవడం కాదు. మన శరీరంలోని సంక్లిష్టమైన ‘బయోలజీ’ అని వైద్య నిపుణులు చెబుతున్నారు. మన శరీరం బరువు తగ్గడానికి ఎందుకు సహకరించదు? ప్రపంచ ఆరోగ్య సంస్థప్రకారం 1975 నుండి ఊబకాయం సమస్య మూడు రెట్లు పెరిగింది. మన దేశంలో కూడా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. అందరూ బరువు తగ్గాలని ప్రయత్నిస్తారు, కానీ కొద్దిమంది మాత్రమే సక్సెస్ అవుతారు. ఎందుకు? ఎందుకంటే మనం బరువు తగ్గాలని డైటింగ్ మొదలుపెట్టినప్పుడు, మన మెదడు అది మన ఆరోగ్యానికి మంచిదని అనుకోదు. బదులుగా, మనం ఏదో ప్రమాదంలో ఉన్నామని, ఆహారం దొరకక ‘ఆకలితో అలమటిస్తున్నామని’ భావిస్తుంది. అక్కడే అసలు సమస్య మొదలవుతుంది.

మనం తక్కువ కేలరీలు తీసుకోవడం ప్రారంభించగానే, శరీరం తన శక్తిని ఆదా చేసుకోవడానికి ‘మెటబాలిజం’ (జీవక్రియ) వేగాన్ని తగ్గించేస్తుంది. అంటే, మీరు తక్కువ తిన్నా సరే, శరీరం చాలా తక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. దీనినే ‘మెటబాలిక్ అడాప్టేషన్’ అంటారు. దీనివల్ల బరువు తగ్గడం ఒకానొక దశలో ఆగిపోతుంది. మనం డైటింగ్ చేస్తున్నప్పుడు, గ్రెలిన్ స్థాయిలు పెరిగి, లెప్టిన్ స్థాయిలు పడిపోతాయి. ఫలితంగా విపరీతమైన ఆకలి, ఆహారంపై కోరికలు పెరుగుతాయి. ఈ హార్మోన్ల మార్పులు డైటింగ్ ఆపేసిన తర్వాత కూడా ఏళ్ల తరబడి కొనసాగుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. మన శరీరంలోని కొవ్వు కణాలకు ఒక రకమైన ‘జ్ఞాపకశక్తి’ ఉంటుంది. శరీరం గతంలో ఏ బరువు వద్ద ఎక్కువ కాలం ఉందో, మళ్ళీ ఆ బరువుకు చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. అందుకే బరువు తగ్గిన వారు మళ్ళీ కిలోలు పెరగడం చూస్తుంటాం. దీనికి తోడు నిద్రలేమి, ఒత్తిడి తోడైతే పరిస్థితి మరింత జటిలమవుతుంది. ఒక్కసారిగా ఆహారం మానేయడం లేదా ‘క్రాష్ డైట్స్’ చేయడం వల్ల శరీరం వెంటనే ‘సర్వైవల్ మోడ్’ లోకి వెళ్తుంది. ఇది మెదడులో హై-కేలరీ ఆహారం తినాలనే కోరికను పెంచుతుంది. అందుకే బరువు తగ్గడం అనేది క్రమంగా, సహజంగా జరగాలి తప్ప బలవంతంగా కాదు. తీవ్రమైన ఊబకాయం ఉన్నవారికి కేవలం డైట్, వ్యాయామం సరిపోకపోవచ్చు. అటువంటప్పుడు ‘బేరియాట్రిక్ సర్జరీ’ వంటి వైద్య చికిత్సలు అవసరమవుతాయని డాక్టర్లు సూచిస్తున్నారు. ఇవి కేవలం కడుపు పరిమాణాన్ని తగ్గించడమే కాకుండా, మెదడుకు వెళ్లే హార్మోన్ల సంకేతాలను మారుస్తాయి. బరువు పెరగడం అనేది కేవలం క్రమశిక్షణ లోపం కాదు, అది ఒక వైద్యపరమైన సమస్య. మన శరీరంతో పోరాడటం కంటే, దాని పనితీరును అర్థం చేసుకుని సహకరించడం ముఖ్యం. సరైన నిద్ర, ఒత్తిడి లేని జీవితం మరియు క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లతో మాత్రమే శాశ్వత బరువు తగ్గడం సాధ్యమవుతుంది.



# ఆపరేషన్‌కు సిద్ధంగా..

శస్త్రచికిత్స, ఆపరేషన్, సర్జరీ. ఏ పేరుతో పిలుచుకున్నా ఇదేం చిన్న విషయం కాదు. ఆరోగ్యం, రోజువారీ పనుల మీద గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఆపరేషన్ అనగానే తదనంతర జాగ్రత్తల మీదే అందరి దృష్టి పడుతుంది. నిజానికి శస్త్రచికిత్సకు ముందు శరీరాన్ని, మనసును సన్నద్ధం చేయటం చాలా ముఖ్యం. చికిత్స ఫలితాలు బాగుండటానికి, త్వరగా కోలుకోవటానికి ఇదెంతగానో తోడ్పడుతుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రాముఖ్యత పెరుగుతోంది.

ఒకప్పుడు ‘ఆపరేషన్‌కు ముందు బాగా విశ్రాంతి తీసుకోండి’ అని చెప్పేవారు. కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్స నిపుణులు చెబుతున్నది ఒక్కటే- ‘శరీరానికి శిక్షణ ఇవ్వండి’ అనే. దీని పేరే ప్రిహాబిలిటేషన్. ఒక్క మాటలో చెప్పాలంటే- క్రీడాకారులు ఆటలకు ముందు అభ్యాసం చేసినట్టే, శస్త్రచికిత్సకు ముందు శరీరాన్ని ‘ఫిట్’గా ఉండేలా చూడటం. అవును.. శస్త్రచికిత్సను తట్టుకోవటానికి, దాన్నుంచి త్వరగా కోలుకోవటానికి శరీరం తగినంత సమర్థంగా ఉండటం కీలకం మరి. కొత్త శాస్త్రీయ ఆలోచన ఇదే. అప్పటికప్పుడు అత్యవసరంగా ఆపరేషన్ అవసరమైనప్పుడు కుదరదు గానీ ముందుగా ప్రణాళిక వేసుకున్న సర్జరీల విషయంలో సన్నద్ధం కావటం సాధ్యమే. ముఖ్యంగా పెద్ద సర్జరీలు, క్యాన్సర్ చికిత్సలకు ముందు ఆయా వ్యక్తుల సామర్థ్యాలకు అనుగుణంగా వ్యాయామాలతో శరీరాన్ని బలోపేతం చేయటం, తగిన పోషణ లభించేలా చూసుకోవటం వంటివి, మానసిక దన్ను కల్పించటం వంటివి అత్యవసరం. ఎన్‌హాన్స్‌డ్ రికవరీ ఆఫ్టర్ సర్జరీ (ఈఆర్‌ఏఎస్) సొసైటీ గత సంవత్సరం విడుదల చేసిన తాజా మార్గదర్శకాలు, అమెరికన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ (ఏఎస్‌ఏ) తాజా సలహాలు దీన్నే నొక్కి చెబుతున్నాయి. ఆపరేషన్‌కు 4 నుండి 8 వారాల ముందు సరైన ప్రణాళికతో పనిచేస్తే, శస్త్రచికిత్స తర్వాత వచ్చే సమస్యలను దాదాపు సగానికి తగ్గించవచ్చు. ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గుతాయి, త్వరగా కోలుకుంటారు, మళ్లీ త్వరగా సాధారణ జీవితం గడుపుతారు. ఏడు స్తంభాలుప్రిహాబిలిటేషన్ ప్రధాన ఉద్దేశం ఆపరేషన్‌కు ముందు శరీరం, మనసు, పోషణ స్థితిని మెరుగుపరచటమే. శారీరకంగా బలంగా, ఆరోగ్యంగా ఉంటేనే శస్త్రచికిత్సతో తలెత్తే మానసిక ఒత్తిడి, ఇబ్బంది, బాధలను బాగా ఎదుర్కొంటుంది. అందుకే దీనిలో రకరకాల అంశాల మీద దృష్టి సారిస్తారు. ప్రధానంగా ఏడు విషయాలను గుర్తించటం ముఖ్యం.

**1 పోషకాహారం.. ముఖ్యంగా ప్రొటీన్**

పెద్ద ఆపరేషన్లకు వచ్చే రోగుల్లో 30 నుంచి 65 శాతం మంది పోషకలోపంతోనే ఉంటారు. ముఖ్యంగా క్యాన్సర్, పేగు జబ్బులతో బాధపడేవారిలో ప్రొటీన్ తక్కువగా ఉంటే గాటు, కుట్లు మానటం ఆలస్యమవుతుంది. ఇన్‌ఫెక్షన్ తలెత్తే అవకాశం రెండు రెట్లు ఎక్కువ. యూరోపియన్ సొసైటీ ఫర్ క్లినికల్ న్యూట్రిషన్ అండ్ మెటబాలిజమ్ (ఈఎస్‌పీఈఎన్) తాజా మార్గదర్శకాల ప్రకారం, ఆపరేషన్‌కు 2-4 వారాల ముందు నుంచి రోజుకు 1.2 నుండి 1.5 గ్రాముల ప్రొటీన్ (ప్రతి కిలో శరీర బరువుకు) తీసుకోవాలి. గుడ్లు, పప్పులు, పాలు, పన్నీరు, చేపలు, చికెన్ వంటివి ఎక్కువగా తినాలి. ఎంయూఎస్‌టీ లేదా ఎన్ఆర్ఎస్-2002 పోషక పరీక్ష చేయటం మంచిది.

**2 రక్తహీనత సరిచేయడం**

మనదేశంలో.. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత చాలా ఎక్కువ. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి ఆపరేషన్ తర్వాత రక్తం ఎక్కించాల్సి రావచ్చు. కోలుకోవటమూ ఆలస్యమవుతుంది. యూకే సెంటర్ ఫర్ పెరియాపరేటివ్ కేర్ తాజా మార్గదర్శకాల ప్రకారం- హిమోగ్లోబిన్ 12 జీ/డీఎల్ కన్నా తక్కువుంటే రక్తనాళం ద్వారా ఐరన్ ఇవ్వాలి. మాత్రల కన్నా ఇది వేగంగా పనిచేస్తుంది. దీన్ని ఆపరేషన్‌కు కనీసం 2 వారాల ముందే ఇవ్వాలి.

**3 గ్లూకోజు నియంత్రణ**

మధుమేహం అదుపులో లేకపోతే గాయం త్వరగా మానదు. ఇన్‌ఫెక్షన్ల ముప్పు రెట్టింపవుతుంది. అమెరికన్ డయాబిటిస్ అసోసియేషన్ 2026 ప్రమాణాల ప్రకారం- అత్యవసరం కాని శస్త్రచికిత్సలకు హెచ్‌బీఏ1సీ 8% కన్నా తక్కువగా ఉండాలి. కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటర్ (సీజీఎం) వాడుతున్నట్టయితే టైమ్ ఇన్ రేంజ్ 50% పైగా ఉండాలి. అయితే హెచ్‌బీఏ1సీ ఎక్కువగా ఉందని ఆపరేషన్‌ను అనవసరంగా వాయిదా వేయటం తగదు. తక్షణం చికిత్స అవసరమైతే చేయాల్సిందే.

**4 పొగాకు, మద్యానికి దూరం**

పొగాకులోని నికోటిన్ రక్తనాళాలు సంకోచించేలా చేస్తుంది. దీంతో గాటు పెట్టిన చోట అవసరమైన రక్తం, ఆక్సిజన్ తగినంత అందదు. అందువల్ల పొగతాగే అలవాటు గలవారు ఆపరేషన్‌కు 4 వారాల ముందు పూర్తిగా మానెయ్యటం మంచిది. దీంతో గాయం ఇన్‌ఫెక్షన్ ముప్పు దాదాపు సగానికి తగ్గుతున్నట్టు 2024 సిస్టమాటిక్ రివ్యూ స్పష్టం చేస్తోంది. ఒక్క సిగరెట్లు, చుట్టలు, బీడీలు మాత్రమే కాదు. గుట్కా, ఖైనీ, పొగాకు నమిలే అలవాటున్నా పూర్తిగా మానెయ్యాల్సిందే. ‘నేను సిగరెట్ తాగను’ అని చెప్పి గుట్కా తినేవారు దీన్ని తప్పక గుర్తుంచుకోవాలి. అలాగే మద్యం అలవాటున్నా నాలుగు వారాల ముందే మానెయ్యాలి. లేకపోతే గుండె, కాలేయం మీద ఒత్తిడి పెరుగుతాయి. రక్తస్రావమయ్యే ప్రమాదముంది.

**5 వ్యాయామ బలం**

‘నాకు ఆపరేషన్ చేస్తారు. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి’ అనేది ఒకప్పటి మాట. ఆపరేషన్‌కు 4 వారాల ముందు నుంచి రోజూ 30 నిమిషాల సేపు వేగంగా నడవటం, 10 నిమిషాలు ఇన్‌సెంటివ్ స్పైరోమెట్రీతో శ్వాస వ్యాయామాలు చేస్తే ఊపిరితిత్తుల సమస్యలు, రక్తం గడ్డలు (డీవీటీ) ఏర్పడే ముప్పు గణనీయంగా తగ్గుతాయని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. 65 ఏళ్లు దాటిన వారికి క్లినికల్ ఫ్రాలిటీ స్కేల్, పిడికిలి బల పరీక్ష వంటి ‘ఫ్రెయిల్టీ స్క్రీనింగ్’ చేయించటం ఇప్పుడు ప్రామాణికంగా మారింది. ఈ పరీక్షలో ఫలితం బలహీనంగా వస్తే ప్రత్యేక పోషకాహారం, ఫిజియోథెరపీ అవసరం. వీటి ద్వారా శరీర సామర్థ్యం పుంజుకుంటుంది.

**6 మానసిక సన్నద్ధత**

ఆపరేషన్ చేస్తారంటే ఎవరికైనా భయమే. దాదాపు 60% మంది తీవ్ర ఆందోళనకు గురవుతారు. దీన్ని తగ్గించటం ఎంతైనా అవసరం. ఎందుకంటే ఆపరేషన్‌కు ముందు ఆందోళనకు గురయ్యేవారికి ఆ తర్వాత నొప్పి, వాంతులు, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి డాక్టర్‌తో ఆపరేషన్ గురించి వివరంగా మాట్లాడటం, ప్రశ్నలు అడగడం, విశ్వసనీయమైన వీడియోలు చూడడం ద్వారా ఆందోళన తగ్గించుకోవాలి. తీసుకున్న నిర్ణయాన్ని కుటుంబంతో పంచుకోవాలి. అలాగే ధ్యానం, ప్రాణాయామం వంటివి సాధన చేయాలి.

**7 మందుల సర్దుబాటు**

ఇది చాలా ముఖ్యం. కొందరు అప్పటికే రక్తాన్ని పలుచగా చేసే ఆస్ప్రిన్, క్లోపిడొగ్రెల్, అపిక్సాబాన్, డాబిగాట్రాన్, రివరోగ్జాబాన్ వంటి మందులు వేసుకుంటూ ఉండొచ్చు. డాక్టర్ సలహా మేరకు వీటిని ఆపాల్సి ఉంటుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం రక్తాన్ని పలుచగా చేసే మాత్రలు వేసుకునేవారికి ‘బ్రిడ్జింగ్ హెపరిన్’ ఇంజెక్షన్లు అవసరం లేదు. ఆపరేషన్‌కు 1-2 రోజుల ముందు మాత్రలు ఆపితే చాలు.

ఇప్పుడు చాలామంది బరువు, మధుమేహం తగ్గడానికి జీఎల్‌పీ-1 రకం ఇంజెక్షన్లు (సెమాగ్లుటైడ్ వంటివి) వాడుతున్నారు. వీటిని తీసుకోవటం ఆపరేషన్‌కు ఒక వారం ముందు ఆపాలి. లేకపోతే ఆపరేషన్ చేసేటప్పుడు జీర్ణాశయంలో మిగిలిన ఆహారం శ్వాసనాళంలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

మూలికా ఔషధాలు, వెల్లుల్లి/అశ్వగంధ మాత్రల వంటివి 1-2 వారాల ముందే ఆపాలి. ఎందుకంటే వీటితో రక్తస్రావం ఎక్కువయ్యే ప్రమాదముంది.

**పాత నమ్మకాలు వద్దు**

ఆపరేషన్‌కు ముందు రాత్రి నుండి నీళ్లు కూడా తాగకూడదనేది పాత పద్ధతి. ఇప్పుడు ఏఎస్‌ఏ మార్గదర్శకాల ప్రకారం- ఆపరేషన్‌కు 2 గంటల ముందు వరకు పంచదార నీళ్లు తాగవచ్చు. ఇది ఆపరేషన్ తర్వాత దాహం, వాంతులు, ఇన్సులిన్ నిరోధకత తగ్గటానికి తోడ్పడుతుంది. ఫలితంగా ఆసుపత్రిలో ఉండాల్సిన రోజులూ తగ్గుతాయి. ః ‘పెద్ద ఆపరేషన్‌కు చాలా పరీక్షలు చేయాలి’ అనేది మరో నమ్మకం. నిజానికి అనవసర పరీక్షలు వద్దు. వయసు, జబ్బులను బట్టి ఏయే పరీక్షలు అవసరమో డాక్టర్లు నిర్ణయిస్తారు.

**అడగాల్సిన ప్రశ్నలివి..**

ఆపరేషన్ విజయవంతం కావటం కేవలం శస్త్రచికిత్స నిపుణుల మీదే ఆధారపడి ఉండదు. వారి నైపుణ్యంతో పాటు ఆపరేషన్ చేయించుకునేవారి ముందస్తు సన్నద్ధత కూడా ముఖ్యమే. అంటే మీ ఆరోగ్యం, మీ చేతుల్లోనే ఉందన్నమాట. అందువల్ల శస్త్రచికిత్స చేయించుకోవటానికి ముందు కొన్ని ప్రశ్నలను డాక్టర్‌ను అడిగి నివృత్తి చేసుకోవాలి.

నాకు ప్రిహాబ్ ప్రోగ్రామ్ అవసరమా?
నా హిమోగ్లోబిన్, షుగర్ స్థాయిలు ఆపరేషన్‌కు సరిపోతాయా?
ఏ మందులు ఎప్పుడు ఆపాలి?
ఆపరేషన్ ముందు ఎన్ని గంటలు ఉపవాసముండాలి?
ఎంత ప్రోటీన్, ఎంత వ్యాయామం అవసరం?
వీటికి సమాధానాలు తెలుసుకొని, ఆచరిస్తే ఆపరేషన్ గండాన్ని తేలికగా దాటొచ్చు.

# భారత్-పాక్ మ్యాచ్ అంటే అదే ఒత్తిడి.. వాచ్‌మన్ మాట గుర్తుచేసిన జెమీమా

- మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్
- ఆదివారం నాడు జరగనున్న దాయాదుల సమరం
- పాక్‌తో మ్యాచ్ అంటే తీవ్ర ఒత్తిడి ఉంటుందన్న జెమీమా రోడ్రిగ్స్
- ఎవరితో ఓడినా పాక్‌తో వద్దని వాచ్‌మన్ అన్నాడని వెల్లడి
- ట్రోఫీ గెలిచినట్టు ఊహించుకుంటూ మానసికంగా సిద్ధమవుతున్నామన్న టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** “ఎవరితో మ్యాచ్‌లో అయినా ఓడిపోవచ్చు కానీ పాకిస్థాన్‌తో మాత్రం ఓడిపోవద్దు” అని తన బిల్డింగ్ వాచ్‌మన్ కూడా తనతో అన్నాడని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఎంతటి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఇదొక నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం (జూన్ 14) పాకిస్థాన్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌తో ఇరు జట్లూ తమ ప్రపంచకప్ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నాయి. ఈ నేపథ్యంలో జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెమీమా మాట్లాడుతూ, “భారత్-పాక్ మ్యాచ్‌ల చరిత్ర, అభిమానుల అంచనాల వల్ల బయటి నుంచి ఒత్తిడి ఉంటుందన్నది వాస్తవం. దీన్ని మనం కాదనలేం” అని హర్మన్‌ప్రీత్ కౌర్ డ్రెస్సింగ్ రూమ్‌లో తమతో చెబుతుంటుందని జెమీమా గుర్తుచేసుకుంది.

అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడానికి జట్టు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోందని ఆమె వివరించింది. జట్టు సన్నద్ధతలో కోచ్ అమోల్ మజుందార్ కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిపింది. 2025 వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన స్ఫూర్తితో ఆడతామని వ్యాఖ్యానించింది. ప్రతి మ్యాచ్‌కు విభిన్న వ్యూహాలతో సన్నద్ధమవుతామని వెల్లడించింది. ముఖ్యంగా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒత్తిడిని తట్టుకుని ఎలా రాణించాలో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నామని జెమీమా పేర్కొంది.

# టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ తొలి వన్డే.. ఎట్టకేలకు ప్రారంభమైంది!

**హైదరాబాద్ పెన్ పవర్:** ధర్మశాల వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. భారీ వర్షం కారణంగా బాగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో, వాతావరణం బౌలర్లకు అనుకూలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓవర్లను 25కి కుదించారు. ఈ సిరీస్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ ఈ మ్యాచ్ ద్వారా జట్టులోకి తిరిగి వచ్చాడు. భారత తుది జట్టులో ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లకు చోటు దక్కింది. యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ కూడా జట్టులో స్థానం సంపాదించారు. మరోవైపు, హష్మతుల్లా షాహిది కెప్టెన్సీలోని ఆఫ్ఘనిస్థాన్ జట్టు కూడా బలంగా కనిపిస్తోంది. ఆ జట్టులో ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ నబీ, స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు.



**తుది జట్లు:**

భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.

ఆఫ్ఘనిస్థాన్: ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, మహ్మద్ సలీమ్ సఫీ, ఏఎం గజన్ఫర్, జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ.

# IPL రికార్డ్స్ ఔట్, చరిత్రలోనే బిగ్గెస్ట్ ఈవెంట్‌గా ఫిఫా.. గ్లోబల్ జీడీపీకి బూస్ట్ ఇచ్చిన వరల్డ్ కప్

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ (FIFA World Cup 2026) కేవలం ఒక ఫుట్‌బాల్ టోర్నమెంట్ మాత్రమే కాదు.. ప్రపంచ క్రీడా చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక విప్లవంగా మారబోతోంది. మునుపెన్నడూ లేని విధంగా 48 జట్లు, బిలియన్ల కొద్దీ వ్యూవర్స్, వేల కోట్ల రూపాయల బిజినెస్‌తో ఈ మెగా ఈవెంట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది.





**చరిత్రలోనే అతిపెద్ద వరల్డ్ కప్:**

గతంలో కేవలం 32 జట్లతోనే జరిగిన ఈ మెగా టోర్నీని.. ఈసారి ఫిఫా ఏకంగా 48 జట్లకు పెంచింది. దాంతో, ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేందుకు 16 నగరాల్లో, 39 రోజుల పాటు రికార్డు స్థాయిలో 104 మ్యాచులు జరగబోతున్నాయి. ఇక గ్లోబల్ పార్టిసిపేషన్‌ను పెంచాలనే ఫిఫా ప్లాన్‌తో ఈసారి కురాకో, కాబో వెర్డే, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ లాంటి 4 దేశాలు తమ ఫస్ట్ వరల్డ్ కప్ మ్యాచ్ ఆడబోతున్నాయి. బ్యాంక్ ఆఫ్ అమెరికా (దీశీటూ) గ్లోబల్ రీసెర్చ్ ప్రకారం.. ఈ మ్యాచులను నేరుగా స్టేడియాల్లో చూసేందుకు సుమారు 65 లక్షల మంది (6.5 Million) ప్రేక్షకులు రాబోతున్నారు.

**600 కోట్ల మంది వ్యూవర్స్:**

ప్రపంచ జనాభాలో దాదాపు ముప్పావు వంతు (చీముతీశ్రీఎ 75శాతం) మంది ఈ వరల్డ్ కప్‌ను టీవీలు, ఓటీటీలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా చూడబోతున్నారని ఫిఫా అంచనా వేసింది. గత ఖతార్ వరల్డ్ కప్‌ను 500 కోట్ల మంది చూస్తే.. ఈసారి ఆ రికార్డు బద్దలై ఏకంగా 600 కోట్ల మంది (6 Billion) ఈ టోర్నీని ఫాలో అవ్వబోతున్నారు. ఫైనల్ మ్యాచ్ జరిగే రోజున ప్రపంచవ్యాప్తంగా ఉండే మొత్తం ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో దాదాపు 7శాతం ట్రాఫిక్ కేవలం ఈ ఫుట్‌బాల్ మ్యాచ్ వల్లే జనరేట్ అవుతుందని విశ్లేషకులు చెప్తున్నారు.

**గ్లోబల్ జీడీపీకి బూస్ట్:**

ఫిఫా అండ్ వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (WTO) సంయుక్త సర్వే ప్రకారం.. ఈ వరల్డ్ కప్ ద్వారా గ్లోబల్ జీడీపీకి ఏకంగా 40.9 బిలియన్ డాలర్లు (సుమారు ?3.90 లక్షల కోట్లు) యాడ్ అవ్వబోతున్నాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా టూరిజం, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, రీటైల్ రంగాలలో 8.24 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు క్రియేట్ అవుతాయి.

**అమెరికాకు బంపర్ ఆఫర్:**

మూడు దేశాలు ఆతిథ్యమిస్తున్నా.. సింహభాగం లాభాలు అమెరికాకే దక్కనున్నాయి. యుఎస్ జీడీపీకి వ17.2 బిలియన్లు (సుమారు 1.64 lakh కోట్లు) అదనంగా సమకూరనున్నాయి. కాగా అమెరికాలోనే దాదాపు 1.85 లక్షల కొత్త ఉద్యోగాలు క్రియేట్ కానున్నాయి.

**ఐపీఎల్, ఎన్ఎఫ్ఎల్ రికార్డులు ఔట్:**

ప్రపంచవ్యాప్త బ్రాండ్స్ అన్నీ ఈ వరల్డ్ కప్‌లో యాడ్స్ ఇవ్వడానికి ఎగబడుతున్నాయి. గ్లోబల్ అడ్వర్టైజర్స్ కేవలం ఈ టోర్నమెంట్ కోసమే ఏకంగా 10.5 బిలియన్ డాలర్లు (సుమారు ?10,500 కోట్లు) ఖర్చు చేయబోతున్నారు. ఇది భారత్ లో జరిగే ఐపీఎల్ తో పాటు అమెరికాలో మోస్ట్ పాపులర్ అయిన ఎన్ఎఫ్ఎల్ ఫుల్ సీజన్ యాడ్స్ ఖర్చు కంటే డబుల్ కావడం విశేషం. దీంతో బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్, స్పాన్సర్‌షిప్స్, టికెట్ సేల్స్ ద్వారా ఫిఫా సంస్థ రికార్డు స్థాయిలో 8.9 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని టార్గెట్ చేసింది. ఇప్పటికే టాప్-టైర్ స్పాన్సర్‌షిప్ ప్యాకేజీలన్నీ హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి.

# పాన్ మసాలా ప్రకటన వివాదం: సల్మాన్ లాయర్ చాలా గట్టోడే!

శ్రుతి హాసన్ ఐవరీ లెహంగా లుక్ క్లాసిక్ సొగసుకు కొత్త నిర్వచనాన్ని ఇస్తోంది





బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్‌కు చట్టపరమైన పాత వివాదం ఒకదానిలో తాత్కాలిక ఉపశమనం లభించింది. డబ్బు కోసం ఒక ప్రముఖ పాన్ మసాలా బ్రాండ్ ప్రకటనలో నటించి వినియోగదారులను తప్పుదోవ పట్టించారంటూ దాఖలైన ఫిర్యాదు ఆధారంగా నడుస్తున్న జిల్లా వినియోగదారుల ఫోరమ్ విచారణా ప్రక్రియను నిలిపివేస్తూ జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) కీలక ఆదేశాలు జారీ చేసింది. రాజస్థాన్‌లోని కోటా జిల్లా వినియోగదారుల ఫోరమ్ (డిసిడిఆర్‌సి) గతంలో సల్మాన్ ఖాన్ సహా పలువురి సంతకాలను ధృవీకరించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై జాతీయ కమిషన్ విచారించింది. ఈ కేసును పరిశీలించిన ఎన్‌సిడిఆర్‌సి అధ్యక్షులు జస్టిస్ ఎ.పి. సాహి, ఇతర సభ్యులు భరత్ కుమార్ పాండ్యాలతో కూడిన ధర్మాసనం.. ఫిర్యాదుదారుడైన ఇంద్ర మోహన్ సింగ్ అలియాస్ హనీకి నోటీసులు జారీ చేసింది. జూన్ 10న ఇచ్చిన తమ ఉత్తర్వుల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కోటా జిల్లా ఫోరమ్‌లో ఈ వివాదానికి సంబంధించిన ఎలాంటి విచారణలు ముందుకు సాగడానికి వీల్లేదని, స్టే విధిస్తున్నామని కమిషన్ స్పష్టం చేసింది. ఈ వివాదంలో జిల్లా ఫోరమ్ తన పరిధిని దాటి వ్యవహరించిందనే అప్పీలుదారుల వాదనపై లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉందని జాతీయ కమిషన్ అభిప్రాయపడింది. సల్మాన్ ఖాన్ తరపున హాజరైన న్యాయవాదుల వాదనలు వినిపిస్తూ.. అసలు వినియోగదారుల చట్టం ప్రకారం.. ఈ ఫిర్యాదుకు విచారణార్హత ఉందా లేదా అనేది ప్రాథమికంగా తేల్చకుండానే జిల్లా ఫోరమ్ నేరుగా సంతకాల ప్రామాణికతను చెక్ చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇదే సంతకాల ధృవీకరణ ఆదేశాలపై గతంలో మే 27న రాజస్థాన్ హైకోర్టు కూడా స్టే ఇచ్చిందని వారు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సెలబ్రిటీలను వేధించడమే లక్ష్యంగా ఇటువంటి ఫిర్యాదులను చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ వేర్వేరు ఫోరమ్‌లలో దాఖలు చేస్తున్నారని అప్పీలుదారులు ఆరోపించారు. ఈ పాన్ మసాలా ప్రకటన వివాదం దేశవ్యాప్తంగా గతంలోనే పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. సల్మాన్ ఖాన్ వంటి అగ్ర శ్రేణి నటుడు ఇటువంటి హానికరమైన ఉత్పత్తుల ప్రకటనల్లో నటించి వినియోగదారులను.. ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టిస్తున్నారనేది ప్రధాన ఫిర్యాదు. ఈ తాజా స్టే ఉత్తర్వుల కాపీని జిల్లా ఫోరమ్ రికార్డులలో ఉంచాలని ఆదేశించిన ఎన్‌సిడిఆర్‌సి.. తదుపరి తుది విచారణను జూన్ 22వ తేదీకి వాయిదా వేసింది. అంతవరకు ఈ కేసులో సల్మాన్ ఖాన్‌కు ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఎదురుకాకపోవడం గమనార్హం. సెలబ్రిటీల వాణిజ్య ప్రకటనలపై వినియోగదారుల చట్టం ఇటీవల కాలంలో చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేసేటప్పుడు సదరు స్టార్స్‌కు కూడా బాధ్యత ఉంటుందని చట్టాలు చెబుతున్నా.. ప్రొసీజర్ – పరిధిని దాటి కోర్టులు ఆదేశాలు ఇవ్వకూడదనే కోణంలో ఈ తాజా తీర్పు ఉన్నట్లు కనిపిస్తోంది. జూన్ 22న తదుపరి విచారణలో జాతీయ కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే అంశంపై అటు సల్మాన్ ఖాన్ అభిమానులతో పాటు లీగల్ వర్గాలలోనూ ఆసక్తి నెలకొంది.



సోషల్ మీడియాలో శివాంగి వర్మ హుందైన చీరకట్టు లుక్ అందరి మనసులను గెలుచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965